

ఏప్రిల్ 30న అప్పన్న చందనోత్సవం

- రూ.1,500, రూ.1,000, రూ.300 టికెట్ల అమ్మకం
- స్లాట్ల ప్రకారమే దర్శనాలు
- కొండపైకి ప్రైవేటు వాహనాలకు అనుమతి నిషేధం
- కలెక్టర్ హరేంధిరప్రసాద్

- 6లో



హత్యకు గురైంది ట్రాన్స్‌జెండర్



పోలీసుల అదుపులో ప్రధాన నిందితుడు

నాలుగేళ్ల నుంచి సహజీవనం

- నాగులాపల్లిలో నివాసం
- సోమవారం అర్ధరాత్రి అక్కడే హత్య
- శరీరాన్ని ముక్కలుగా కోసి మూడుచోట్ల పడవేత
- గంటల వ్యవధిలోనే నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు



జలగలమదుం సమీపంలో పడేసిన శరీర భాగాలను పోలీసులకు చూపుతున్న నిందితుడు బన్నీ (మధ్యలో ఉన్న పొడవాటి వ్యక్తి). (ఇన్‌సెట్‌లో) హత్యకు గురైన ట్రాన్స్‌జెండర్ దీపు (ఫైల్‌ఫొటో)

కశింకోట, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): **మండలంలోని బయ్యవరం సమీపంలో ఒక కల్వర్టు వద్ద మంగళవారం ఒక మహిళకు చెందిన కొన్ని శరీర భాగాలు లభ్యమైన సంఘటనకు సంబంధించి మిస్టరీని పోలీసులు ఛేదించారు. హత్యకు గురైంది మహిళ కాదని, ట్రాన్స్‌జెండర్ అని బుధవారం నిర్ధారించారు. మిగిలిన శరీర భాగాలను మరో రెండుచోట్ల గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ప్రధాన నిందితుడిని గంటల వ్యవధిలోనే అదుపులోకి తీసుకున్నారు. అతను ట్రాన్స్‌జెండర్‌తో నాలుగేళ్ల నుంచి సహజీవనం చేస్తున్నట్టు పోలీస్ వర్గాల ద్వారా తెలిసింది. ఇందుకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి.**

కశింకోట మండలం బయ్యవరం సమీపంలోని అండర్ బ్రిడ్జి వద్ద మంగళవారం ఉదయం రక్తపు మరకలతో ఒక మూట ఉన్నట్టు సమాచారం అందడంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. క్లూస్ టీమ్‌ను రప్పించి మూటను విప్పగా...మహిళ నడుము నుంచి కింద భాగం, కుడి చెయ్యి మాత్రమే ఉన్నాయి. దీంతో హత్యకు గురైన వ్యక్తి ఎవరో గుర్తు పట్టలేకపోయారు. జిల్లా ఇన్‌చార్జి ఎస్పీ వకుల్ జిందాల్ కూడా సంఘటనా స్థలానికి వచ్చి పరిశీలించారు. ఈ కేసు దర్యాప్తు కోసం ఎనిమిది ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేశారు. మహిళను హత్య చేసి కొన్ని శరీర భాగాలను బయ్యవరం వద్ద పడేశారనే వార్త ఈ ప్రాంతంలో దావానలంలా వ్యాపించింది. ఈ నేపథ్యంలో మునగపాక మండలం నాగులాపల్లిలో ట్రాన్స్‌జెండర్ ఒకరు అద్దెకు వుంటున్న ఇంటి వెలుపల రక్తపు మరకలు చూసిన స్థానికులు ఈ విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. మంగళవారం అర్ధరాత్రి క్లూస్ టీమ్ అక్కడకు వెళ్లి ఇంటిలో పరిశీలించారు. ఇంటిలో ఎవరెరు వుంటున్నారో పోలీసులు ఆరా తీశారు. బన్నీ అనే 30 ఏళ్ల యువకుడు, ట్రాన్స్‌జెండర్ కలిసి వుంటున్నట్టు గుర్తించారు. అర్ధరాత్రి దాటిన తరువాత అతడిని అదుపులోకి తీసుకున్నారు. ట్రాన్స్‌జెండర్ పేరు షైపాలి దిలీప్ శివశంకర్ అలియాస్ దీపు (40) అని అతను చెప్పినట్టు సమాచారం. అతను ఇచ్చిన సమాచారంతో కశింకోట సీఐ స్వామినాయుడు, పోలీసు సిబ్బంది బుధవారం ఉదయం అనకాపల్లి పట్టణ శివారులోని జగలమదుం కూడలి సమీపంలో జాతీయ రహదారికి వెళ్లే మార్గంలో ఒక బాక్సును స్వాధీనం చేసుకున్నారు. దానిని తెరిచిచూడగా

... మిగతా 6వ పేజీలో

హత్యపై స్పందించిన సీఎం

అమరావతి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లాలో మహిళను (తరువాత ట్రాన్స్‌జెండర్‌గా గుర్తింపు) కిరాతకంగా హత్య చేసిన ఘటనలో నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. ఈ ఘటనలో నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు సీఎంకు జిల్లా ఎస్పీ, పోలీసు ఉన్నతాధికారులు వివరించారు. ఈ ఘటనపై పోలీసులు ఉన్నతాధికారులు, అనకాపల్లి జిల్లా ఎస్పీతో ముఖ్యమంత్రి మంగళవారం మాట్లాడారు. ఢిల్లీ నుంచి బుధవారం ఉదయం మరోసారి ఆయన అనకాపల్లి జిల్లా ఎస్పీతో మాట్లాడారు. ఈ దారుణానికి పాల్పడిన నిందితులకు కఠిన శిక్షపడేలా చూడాలని ఆదేశించారు.

స్వయం ఉపాధికి పెద్దపీట

బీసీ, ఈడబ్ల్యూఎస్‌లకు సబ్సిడీపై రుణాలు

మూడు శ్లాబ్‌లుగా స్వయం ఉపాధి పథకాలు



- శ్లాబ్-1 రూ.2 లక్షలు, శ్లాబ్-2 రూ.2-3 లక్షలు, శ్లాబ్-3 రూ.3-5 లక్షలు
- అన్ని యూనిట్లుకు 50 శాతం సబ్సిడీ
- ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు
- ఈ నెల 22 వరకు గడువు
- జిల్లాకు 2,732 యూనిట్లు మంజూరు

అనకాపల్లి/ రోలుగుంట, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): **వెనుకబడిన తరగతులు (బీసీ), అగ్రవర్ణాల్లో ఆర్థికంగా బలహీనంగా వున్న వారిలో (ఈడబ్ల్యూఎస్) పేదరికాన్ని రూపుమాపడానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఆయా వర్గాల్లోని పేదలకు స్వయం ఉపాధి యూనిట్ల ఏర్పాటు కోసం బీసీ, ఓసీ కార్పొరేషన్ల సబ్సిడీ రుణాలు మంజూరు చేసేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇందుకు అర్హులైన వారు ఈ నెల 22వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం ప్రకటించింది.**

వైసీపీ ఐదేళ్ల పాలనలో ఏ ఒక్క వర్గానికి కూడా స్వయం ఉపాధి రుణాల మంజూరు చేయలేదు. దీంతో ఆయా వర్గాలు స్వయం ఉపాధికి దూరమయ్యారు. అయితే గత ఏడాది జూన్‌లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం.. బీసీలతోపాటు ఆర్థికంగా వెనుకబడిన అగ్రవర్ణాల (కమ్మ కాపు, రెడ్డి, ఆర్యవైశ్య, క్షత్రియ, బ్రాహ్మణ, బలిజ, తెలగ, ఒంటరి వగైరా) వారికి స్వయం ఉపాధి కల్పనకు ప్రణాళికను రూపొందించి అమలు చేస్తున్నది. వ్యవసాయ అనుబంధ, రవాణా, పరిశ్రమలు, సేవలు, వ్యాపార రంగాల్లో స్వయం ఉపాధి, చేతివృత్తుల వారికి సబ్సిడీపై రుణాలు మంజూరు చేస్తారు.

స్వయం ఉపాధి పథకాలను శ్లాబ్‌లుగా విభజించారు. శ్లాబ్-1 కింద యూనిట్ విలువ రూ.2 లక్షలుగా నిర్ధారించారు. శ్లాబ్-2 కింద యూనిట్ విలువ రూ.2-3 లక్షలు, శ్లాబ్-3 కింద రూ.3-5 లక్షలుగా నిర్ణయించారు. ప్రతి శ్లాబ్‌లో యూనిట్ విలువలో 50 శాతం సబ్సిడీ వుంటుంది. కిరాణా దుకాణం, పాన్ షాపు, పండ్లు/ కూరగాయల వ్యాపారం, పాలు/ పాల ఉత్పత్తులు, కోడిగుడ్లు, సెలూన్, మెకానిక్ షెడ్డు, ప్లంబింగ్, ఎలక్ట్రికల్, ఎంబ్రాయిడరీ, బుక్ స్టాల్, జెరాక్సు షాపు, ఇంటర్‌నెట్ సెంటర్, కేటరింగ్ యూనిట్, డ్రై ఫ్రూట్స్ షాపు, బియ్యం వ్యాపారం, ఫర్నీచర్ షాపు, వెల్డింగ్ షాపు, మినీ డెయిరీలు ఫారాలు, కోళ్ల ఫారం, మేకలు, గొర్రెల పెంపకం, టెంట్ హౌస్, కార్పెంటరీ, జనరిక్ మందుల దుకాణాలు, మినీ వ్యాన్, ఈ-ఆటో, ఈ-ట్రక్కు, పాసింజర్ ఆటో, పాసింజర్ ట్రక్కు, ఆటో తదితర యూనిట్లు అందుబాటులో ఉన్నాయి.

ఇక మేదర, కుమ్మరి, శాలివహన, ఇతర కుల వృత్తిదారులకు (ముగ్గురి నుంచి ఐదుగురి వరకు) ఎంఎస్‌ఎంఈ కింద బీసీ సర్వీసెస్ కోఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ ద్వారా ఒక్కొక్క యూనిట్‌కు బ్యాంకు రుణం రూ.1.5 లక్షలు, ప్రభుత్వ రాయితీ రూ.1.5 లక్షలు కలిపి మొత్తం రూ.3 లక్షల వరకు మంజూరు చేస్తారు.

వయసు అర్హత

కాపు, బలిజ, తెలగ, ఒంటరి అయితే 21 నుంచి 50 ఏళ్ల లోపు వయస్సు ఉన్న వారు అర్హులు, ఇతర వర్గాలకు చెందిన వారు అయితే 21 నుంచి 60 ఏళ్ల లోపు ఉన్న వారు అర్హులు. వార్షిక ఆదాయం పట్టణ ప్రాంతాల్లో రూ.1.03 లక్షలు, గ్రామీణ ప్రాంతాల్లో రూ.81 వేలకు మించకూడదు. బియ్యం కార్డు, ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరి. చదువుకున్న వారైతే విద్యార్హత పత్రాలు కూడా అప్‌లోడ్ చేయాలి.

ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకునే వెబ్‌సైట్

జిల్లాకు 2,732 యూనిట్లు

జిల్లాలో బీసీ, ఈడబ్ల్యూఎస్‌లకు 2,732 యూనిట్లు మంజూరు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం తొలి విడత రూ.62.83 కోట్లు కేటాయించింది. అర్హులైన వారి నుంచి ఈ నెల 10వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేక వెబ్ పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకువచ్చారు. మీసేవా కేంద్రాలు లేదా సచివాలయాలకు వెళ్లి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఆఫ్‌లైన్ ద్వారా ఎంపీడీవోలకు నేరుగా దరఖాస్తులు అందజేయవచ్చు. దరఖాస్తుల స్వీకరణకు ఈ నెల 22వ తేదీ వరకు గడువు విధించారు.

అర్హులంతా దరఖాస్తు చేసుకోవచ్చు

స్వయం ఉపాధి కోసం బీసీలు, ఈడబ్ల్యూఎస్ వర్గాల వారిలో అర్హులంతా దరఖాస్తు చేసుకోవచ్చని జిల్లా వెనుకబడిన తరగతుల సేవా సహకార సంఘం కార్యనిర్వాహక సంచాలకుడు జి.పెంటాజీరావు తెలిపారు. ల్లాస్థాయి ఎంపిక కమిటీ ఆధ్వర్యంలో అర్హుల ఎంపిక జరుగుతుందన్నారు. ఎంపికైన వారికి బ్యాంకు లింకేజీతో సబ్సిడీ రుణాలు మంజూరు చేస్తామన్నారు.



మాడుగుల మోదమాంబ కాలనీలో గిరినాగును పట్టుకుంటున్న వెంకటేశ్



గదబూరులో గిరినాగును పట్టుకుంటున్న వెంకటేశ్

మాడుగులలో భారీ గిరినాగులు

- వేర్వేరుచోట్ల రెండు కింగ్‌కోబ్రాలు పట్టివేత
- అడవిలో విడిచిపెట్టిన స్నేక్ క్యాచర్ వెంకటేశ్

మాడుగుల, మార్చి 19: కేంద్రంలోని వేర్వేరు ప్రాంతాల్లో గురువారం రెండు భారీ గిరి నాగు (కింగ్ కోబ్రా)లు హల్‌చల్ చేశాయి. మాడుగుల శివారులోని గదబూరులో చిన్ని అచ్చిబాబు తన ఇంటి పరిసరాల్లో ఉన్న తుప్పలను తొలగిస్తుండగా అప్పటికే అక్కడ వున్న గిరి నాగు బుసులు కొడుతూ బయటకు వచ్చింది. దీంతో స్థానిక స్నేక్ క్యాచర్ పెచ్చేటి వెంకటేశ్‌కి సమాచారం ఇచ్చారు. అతను వచ్చి సుమారు 15 అడుగుల పొడవు వున్న గిరినాగును చాకచక్యంగా పట్టుకున్నాడు. కొద్దిసేపటి తరువాత మోదమాంబ కాలనీ శివారు ఎలుబండి కనక కల్లాల వద్ద గిరినాగు కనిపించింది. సమాచారం అందుకున్న వెంకటేశ్ వచ్చి పట్టుకున్నాడు. ఇది కూడా ఇంచుమించు 15 అడుగుల పొడవు వుంది. అనంతరం రెండు గిరి నాగులను సమీపంలోని అడవిలో విడిచిపెట్టాడు.

నిబంధనలు పాటించకుంటే రవాణా వాహనాలు సీజ్

- కలెక్టర్ విజయకృష్ణన్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): నిబంధనలు పాటించకుండా బండరాళ్లను రవాణా చేసే వాహనాలను సీజ్ చేస్తామని కలెక్టరు విజయకృష్ణన్ హెచ్చరించారు. బుధవారం కలెక్టరేట్‌లో అధికారులతోపాటు క్వారీలు, లారీల యజమానుల సంఘం ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, క్వారీ లారీల వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, బండరాళ్లతో అధిక బరువుతో వెళుతున్న క్వారీ లారీ పట్టణంలోని రైల్వే అండర్ బ్రిడ్జిని ఢీకొట్టడంతో రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడిందన్నారు. భారీ వాహనాల వల్ల ప్రమాదాలు జరిగితే ఆయా వాహనాలను సీజ్ చేస్తామని, నిబంధనలు పాటించని వాహనదారులపై చట్టపరమైన చర్యలు చేపడతామని ఆమె స్పష్టం చేశారు. భారీ వాహనాలు రోడ్లపై ఇష్టానుసారంగా తిరిగి ప్రజల ప్రాణాలు, ఆస్తులకు నష్టం కలిగిస్తే చూస్తూ ఊరుకొనేది లేదన్నారు. ఈ సమావేశంలో డీఆర్‌ఓ సత్యనారాయణరావు, ఆర్డీఓ షేక్ ఆయీషా, డీఎస్పీ వి.మోహన్‌రావు, జిల్లా రవాణా అధికారి మనోహర్, పీఆర్ ఈఈ వీరంనాయుడు, గనుల శాఖ జిల్లా అధికారి శ్రీనివాసరావు, రెవెన్యూ, విజిలెన్స్, పోలీసు శాఖల అధికారులు పాల్గొన్నారు.

చెరకు రైతులకు గోవాడే దిక్కు!



గోవాడ ఫ్యాక్టరీలో చెరకు బండ్లు

బెల్లానికి తగ్గిన గిరాకీ

- చెరకు కొనుగోలు చేయని పొరుగు జిల్లా ప్రైవేటు ఫ్యాక్టరీ యాజమాన్యం
- గోవాడపైనే రైతుల ఆశలు
- ఇంతవరకు 79 వేల టన్నుల చెరకు క్రషింగ్
- రెండు వారాల్లో క్రషింగ్ పూర్తిచేస్తామని కలెక్టర్ ప్రకటన
- ఇంకా పొలాల్లో 40 వేల టన్నుల చెరకు
- రోజు వారీ సగటు క్రషింగ్ 1,400 టన్నులు
- ఈ లెక్కన కనీసం 26 రోజులు పడుతుందని అంచనా

చోడవరం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): బెల్లం సీజన్ దాదాపు ముగియడం, పొరుగు జిల్లాల్లోని ప్రైవేటు షుగర్ ఫ్యాక్టరీల యాజమాన్యాలు గోవాడ షుగర్ ఫ్యాక్టరీ పరిధిలో రైతుల నుంచి చెరకు కొనుగోలు చేసే పరిస్థితి లేకపోవడంతో ఈ ఏడాది గోవాడపైనే చెరకు రైతులు భారం వేసి కూర్చున్నారు. క్రషింగ్‌కు తరచూ అంతరాయాలు ఏర్పడుతుండడంతో యార్డుతోపాటు కాటాల వద్ద చెరకు నిల్వలు పేరుకుపోతున్నాయి. ఈ పరిస్థితిని చక్కదిద్దడానికి ఫ్యాక్టరీ అధికారులు కటింగ్ పర్మిట్ల జారీ నిలిపివేయగా, పొలంలో చెరకు ఎండిపోతుందన్న భయంతో రైతులు చెరకును నరికి ఫ్యాక్టరీకి తరలిస్తున్నారు.

దేవరాపల్లి మండలం కొత్తపెంట గ్రామానికి చెందిన చెరకు రైతు రొంగల వెంకటరావు, తన తోటకు నిప్పంటించుకున్న ఘటన సంచలనం రేపడం, జిల్లా కలెక్టర్ విచారణకు ఆదేశించడంతో చెరకు రైతుల సమస్యలు మరోసారి చర్చనీయాంశంగా మారాయి. ఈ నేపథ్యంలో గోవాడలో చెరకు క్రషింగ్‌ను రెండు వారాల్లో పూర్తి చేస్తామని కలెక్టర్ ప్రకటించగా, పొలాల్లో ఇంకా 40 వేల టన్నులకుపైగా చెరకు ఉన్నట్టు ఫ్యాక్టరీ అధికారుల సమాచారం. ప్రస్తుతం క్రషింగ్ జరుగుతున్న తీరును బట్టి రోజుకు సగటున 1,500 టన్నులకు మించి చెరకు క్రషింగ్ అయ్యే పరిస్థితి లేదు. ఇకపై ఎలాంటి అంతరాయాలు లేకుండా పొలాల్లో వున్న చెరకును క్రషింగ్ చేయాలంటే 26 రోజులుపైగా పడుతుంది. వాస్తవానికి రోజు వారీ క్రషింగ్ సామర్థ్యం ఐదు వేల టన్నులు అయినప్పటికీ, ఎప్పుడూ 3,500 టన్నులకు మించలేదు. ఈ ఏడాది ఓవర్‌హాలింగ్ పనులు సక్రమంగా చేయకపోవడంతో క్రషింగ్ సామర్థ్యం బాగా తగ్గిపోయింది. జనవరి 21వ తేదీన రెగ్యులర్ క్రషింగ్ ప్రారంభించగా ఇంతరకు (56 రోజులు) 79 వేల టన్నుల చెరకు మాత్రమే క్రషింగ్ జరిగింది. సగటున 1,400 టన్నులకు మించి క్రషింగ్ జరగడం లేదు. ఇటువంటి పరిస్థితుల్లో రైతుల వద్ద వున్న చెరకు మొత్తం రెండు వారాల్లో క్రషింగ్ చేయడం అసాధ్యమేనని అంటున్నారు.

వాస్తవానికి ఈ ఏడాది ఫ్యాక్టరీకు చెరకు సరఫరా అనుకున్నంత జరగదని అధికారులు తొలుత భావించారు. ఈ కారణంగానే క్రషింగ్ లక్ష్యాన్ని లక్షా 50 వేల టన్నుల నుంచి లక్ష టన్నులకు కుదించారు. అయితే ఈ ఏడాది మార్కెట్‌లో బెల్లం ధరలు ఆశాజనకంగా లేకపోవడంతో పలువురు రైతులు బెల్లం తయారీకి ఆసక్తి చూపలేదు. మరోవైపు శ్రీకాకుళం జిల్లా సంకిలి ఫ్యాక్టరీ యాజమాన్యం 'గోవాడ' ఫ్యాక్టరీ పరిధిలో చెరకు కొనుగోలు చేసేది. అయితే ఈ ఏడాది చెరకు కొనుగోలు చేయలేదు. దీంతో రైతులంతా గోవాడ ఫ్యాక్టరీపై ఆధారపడాల్సి వచ్చింది.

27న మాకవరపాలెం ఎంపీపీ ఎన్నిక

మొత్తం ఎంపీటీసీలు 16

- వైసీపీకి 11 మంది, టీడీపీకి నలుగురు, ఒక స్థానం ఖాళీ
- ఒప్పందం మేరకు రుత్తల ఈశ్వరరావుకు అవకాశం
- రేసులో మరికొంతమంది వైసీపీ సభ్యులు

మాకవరపాలెం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల ప్రజా పరిషత్ (ఎంపీపీ) అధ్యక్ష పదవికి ఈ నెల 27న ఎన్నిక నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్ ఉత్తర్వులు జారీ చేసినట్టు ఎంపీడీవో సీతామహాలక్ష్మి బుధవారం తెలిపారు. 23వ తేదీన నోటిఫికేషన్ జారీ చేస్తామని, 27వ తేదీ ఉదయం 11 గంటలకు ఎన్నిక నిర్వహిస్తామని పేర్కొన్నారు.

సుమారు మూడున్నరేళ్ల క్రితం జరిగిన ఎంపీటీసీ ఎన్నికల్లో మండలంలో వైసీపీ తొమ్మిది, టీడీపీ ఏడు స్థానాలను కైవసం చేసుకున్నాయి. అయితే ఎన్నికలు 2020 మార్చిలో జర్గా, అదే సమయంలో కొవిడ్-19 ప్రబలడంతో ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేపట్టలేదు. మరుసటి ఏడాది సెప్టెంబరులో ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు ప్రకటించారు. ఈ మధ్య కాలంలో టీడీపీకి చెందిన పైడిపాల ఎంపీటీసీ సభ్యురాలు రుత్తల రమణమ్మ అనారోగ్యంతో చనిపోగా, భీమబోయిన పాలెం నుంచి టీడీపీ తరఫున పోటీ చేసిన అల్లు రామునాయుడు, పంచాయతీ ఎన్నికల్లో శెట్టిపాలెం సర్పంచ్‌గా పోటీ చేసి గెలిచారు. ఈ ఫలితం వచ్చిన ఆరు నెలల తరువాత ఎంపీటీసీ ఓట్లను లెక్కించారు. దీంతో భీమబోయినపాలెం ఎంపీటీసీ పదవికి ఆయన రాజీనామా చేశారు. బూరుగుపాలెం నుంచి గెలుపొందిన టీడీపీ అభ్యర్థి రుత్తల యర్రాపాత్రుడు వైసీపీలో చేరారు. వైసీసీకి చెందిన పాపయ్యపాలెం సభ్యురాలు పైలా భవానీ ఎంపీపీగా ఎన్నికయ్యారు. భీమబోయినపాలెం ఎంపీటీసీ స్థానానికి అదే ఏడాది నవంబరులో ఉప ఎన్నికలు జరిగాయి. వైసీపీ అభ్యర్థి రుత్తల సత్యనారాయణ గెలుపొందారు. దీంతో ఎంపీపీగా ఉన్న భవానీని తప్పించి ఆయన ఎంపీపీ అయ్యారు. తొలుత రెండున్నరేళ్లు సత్యనారాయణ, మిగిలిన రెండున్నరేళ్లు మాకవరపాలెం ఎంపీటీసీ రుత్తల సర్వేశ్వరరావు ఎంపీపీగా వుండాలని అప్పట్లో ఒప్పందం జరిగింది. సత్యనారాయణ పదవీ కాలం రెండున్నర ఏళ్లు పూర్తయ్యేనాటికి సాధారణ ఎన్నికలు రావడంతో జూన్ 30వ తేదీన జడ్పీ సీఈవోకు రాజీనామ లేఖను అందించారు. వైస్ ఎంపీపీగా ఉన్న తామరం ఎంపీటీసీ సభ్యురాలు రుత్తల లక్ష్మి ఇన్‌చార్జి ఎంపీపీగా బాధ్యతలు చేపట్టారు. ఈ నేపథ్యంలో ఖాళీగా వున్న ఎంపీపీ పదవులకు 27న ఎన్నికలు నిర్వహించాలని ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ జారీచేసింది. గతంలో చేసుకున్న ఒప్పందం ప్రకారం రుత్తల సర్వేశ్వరరావు ఎంపీపీ అవుతారని భావిస్తున్నారు. వైసీపీకి పూర్తి మోజారిటీ వున్నప్పటికీ రుత్తల సర్వేశ్వరరావుతోపాటు మరికొందరు ఎంపీపీ పదవిని ఆశిస్తున్నట్టు తెలిసింది. వైసీపీ సభ్యుల్లో కొంతమందిని తమ వైపునకు తిప్పుకుని ఎంపీపీ పీఠాన్ని కైవసం చేసుకోవాలని టీడీపీ నేతలు ప్రయత్నాలు మొదలుపెట్టినట్టు సమాచారం.

జాతీయ సీనియర్ మహిళల హాకీ శిబిరానికి

ఎలమంచిలి క్రీడాకారిణి ఎంపిక



లొట్ల మేరీ

ఎలమంచిలి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలికి చెందిన హాకీ క్రీడాకారిణి లొట్ల మేరీ సీనియర్ మహిళల జాతీయ హాకీ జట్టు శిబిరానికి ఎంపికైంది. ఈ నెల 23వ తేదీన బెంగళూరులో ఈ శిబిరం ప్రారంభం కానున్నది. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి 65 మందిని ఎంపిక చేయగా, వీరిలో మేరీకి చోటు లభించింది. ఇక్కడ ఉత్తమ ప్రతిభ చూపితే సుమారు 30 మందితో జాతీయ జట్టును ఎంపిక చేస్తారు. అంతర్జాతీయ పోటీలు జరిగే ముందు ఈ 30 మందిలో నుంచి తుది జట్టును ఎంపిక చేస్తారు. మహిళల జాతీయ హాకీ జాతీయ జట్టు శిబిరానికి గతంలో ఎలమంచిలికి చెందిన మడగల భవానీ ఎంపికైంది.

చిత్తడి నేలలను పరిరక్షించాలి: కలెక్టర్

అనకాపల్లి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో చిత్తడి నేలల పరిరక్షణకు అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశించారు. చిత్తడి భూముల పరిరక్షణపై బుధవారం కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి సమన్వయ కమిటీతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్పేస్ అప్లికేషన్ సెంటర్ నివేదిక ప్రకారం జిల్లాలో 951 చోట్ల చిత్తడి నేలలు ఉన్నాయని తెలిపారు. వీటిలో సహజంగా ఏర్పడిన జలాశయాలు ఎన్ని? మండలాల వారీగా చిత్తడి నేలలు ఎన్ని ఉన్నాయనే వివరాలు సేకరించి నివేదిక ఇవ్వాలన్నారు. సమావేశంలో జిల్లా అటవీ శాఖాధికారి ఎం.శామ్యూల్, ఆర్డీఓలు షేక్ ఆయీషా, వి.వి.రమణ, సబ్ డీఎఫ్‌ఓ సునీల్‌కుమార్, సర్వే ఏడీ రాజ్‌గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : 6.12 (గురువారం సాయంత్రం)

సహార్ : 4.46 (శుక్రవారం ఉదయం)

యాదవ కార్పొరేషన్ డైరెక్టర్‌గా ధూళి రంగనాయకులు

▸▸ అధికారికంగా ప్రకటన విడుదల ▸▸ అభిమానులు హర్షం



ఎలమంచిలి/రాంబిల్లి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : యాదవ కార్పొరేషన్ డైరెక్టర్‌గా రాంబిల్లి మండలం హరిపురం గ్రామానికి చెందిన టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ధూళి రంగనాయకులు నియామకమయ్యారు. ఈ మేరకు బుధవారం అధికారికంగా ప్రకటన విడుదలైంది. రంగనాయకులు టీడీపీ గ్రామ శాఖ అధ్యక్షుడిగా రాజకీయ అరంగేట్రం చేశారు. అనంతరం ఎంపీటీసీ సభ్యునిగా, పార్టీ మండల శాఖ అధ్యక్షుడిగా, ఎలమంచిలి మార్కెట్ కమిటీ చైర్మన్ సేవలందించారు. ప్రస్తుతం టీడీపీ రాష్ట్ర కార్యదర్శిగా కొనసాగుతున్నారు. పార్టీకి ఆయన అందిస్తున్న సేవలకు గుర్తింపుగా అధిష్టాం ఈ పదవిని కట్టబెట్టింది. ఎలమంచిలి నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ప్రగడ నాగేశ్వరరావులతో కలిసి ఈయన ఐక్యంగా ముందుకు సాగుతుంటారు. రంగనాయకులుకు డైరెక్టర్ పదవి రావడం పట్ల పార్టీ శ్రేణులతో పాటు ఆయన అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ అధిష్టానం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలుపుకుంటూ సేవలందిస్తానని వివరించారు.

పునరుత్పాదక ఇంధనంపై శిక్షణకు 'ప్రశాంతి' అధ్యాపకులు ఎంపిక

▸▸ ఉత్తరాఖండ్‌లోని రుర్కీ ఐఐటీకి పయనం



శిక్షణకు ఎంపికైన అధ్యాపకులు

అచ్యుతాపురం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో పునరుత్పాదక ఇంధన రంగంలో యువతకు శిక్షణ ఇచ్చేందుకు అచ్యుతాపురంలోని ప్రశాంతి విద్యా సంస్థలకు చెందిన నలుగురు అధ్యాపకులు ఎంపికయ్యారు. ఉత్తరాఖండ్‌లోని రుర్కీ ఐఐటీలో వీరికి ఈ నెల 27వ తేదీ వరకు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్న నేపథ్యంలో వీరు తరలి వెళ్లారు. పునరుత్పాదక ఇంధనంలో ఉండే ప్రయోజనాలు, ఈ రంగంలో లభించే ఉపాధి అవకాశాలు తదితర అంశాలపై వీరికి శిక్షణ ఇవ్వనున్నారు. శిక్షణానంతరం వీరు స్థానిక యువతతో పాటు నిరుద్యోగులకు శిక్షణ ఇస్తారని ప్రశాంతి విద్యా సంస్థల చైర్మన్ ధర్మిరెడ్డి ప్రసాద్ బుధవారం విలేకరులకు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈ రంగంలో ఉపాధి కోసం ముందుకు వచ్చే 18 సంవత్సరాలు నిండిన యువతకు ఉచితంగా తొంభై రోజుల పాటు శిక్షణ అందిస్తామన్నారు. దీని ద్వారా స్మాల్, హైడ్రోపవర్ ప్లాంట్, గ్రీన్ హైడ్రోజన్ రంగాల్లో ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆయన వివరించారు.

డ్వాక్రా సంఘాలు పొదుపు పాటించాలి

▸▸ వెలుగు కో-ఆర్డినేటర్ ధర్మారావు

మునగపాక, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : డ్వాక్రా సంఘాల మహిళలకు పొదుపుతో పాటు ఖాతాల నిర్వహణ, లావాదేవీలపై ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలని వెలుగు కో-ఆర్డినేటర్ ధర్మారావు సూచించారు. ఇక్కడి వెలుగు కార్యాలయంలో బుధవారం డేటా ఎంట్రీ తదితర అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సక్రమంగా పొదుపు పాటించే గ్రూపులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు విధాలుగా ప్రోత్సాహకాలు, వడ్డీ రాయితీలు అందిస్తున్నట్టు చెప్పారు. నిర్దేశించిన గడువులోగా గ్రూపులకు సంబంధించిన డేటాను నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వెలుగు కార్యాలయ అధికారి బాలరాజు, సిబ్బంది పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న కో-ఆర్డినేటర్ ధర్మారావు

ట్రాన్స్‌జెండర్ దీపు నాగులాపల్లిలో నివాసం

▸▸ ఏడాదిగా ఉంటున్నట్టు తెలియడంతో క్లూస్ టీమ్ వివరాలు ఆరా



హత్యకు గురైన దీపు నాగులాపల్లిలో అద్దెకు నివాసం ఉంటున్న ఇల్లు ఇదే

మునగపాక, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): హత్యకు గురైన ట్రాన్స్‌జెండర్ దీపు సుమారు ఏడాది నుంచి మండలంలోని నాగులాపల్లిలో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నది. మంగళవారం ఉదయం కశింకోట మండలం బయ్యవరం వద్ద ఒక మహిళకు చెందిన కొన్ని శరీర భాగాలు కనిపించడంతో పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఈ నేపథ్యంలో నాగులాపల్లిలో ట్రాన్స్‌జెండర్ అద్దెకు వుంటున్న ఇంటి వెలుపల రక్తపు మరకలు చూసిన కొంతమంది స్థానికులు ఈ విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. మంగళవారం అర్ధరాత్రి క్లూస్ టీమ్ ఇక్కడకు వచ్చి ఇంటిలో పరిశీలించింది. బుధవారం స్థానిక పోలీసులు ట్రాన్స్‌జెండర్ అద్దె ఇంటి వద్ద ఉండడంతో బయ్యవరంలో కలకలం రేపిన మహిళ శరీర భాగాలు ట్రాన్స్ జెండర్ వేనని తెలుసుకున్నారు.

సుమారు ఏడాది నుంచి హిజ్రా అద్దెకు ఉంటున్నదని, ప్రతి నెల క్రమం తప్పకుండా అద్దె చెల్లిస్తున్నదని, అంతకుమించి వివరాలు తెలియదని ఇంటి యజమాని పొలమరశెట్టి నూకరాజు చెబుతున్నారు

ఉచిత కుట్టు శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానం

ఎలమంచిలి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : బీసీ కార్పొరేషన్ ద్వారా మునిసిపాలిటీలోని మహిళలకు ఉచితంగా కుట్టు శిక్షణ ఇవ్వనున్నట్టు కమిషనర్ ప్రసాదరాజు బుధవారం తెలిపారు. శిక్షణానంతరం స్వయం ఉపాధి పొందేందుకు బ్యాంకు అంగీకారంతో సబ్సిడీతో కూడిన రుణాలు మంజూ చేయడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు. దరఖాస్తులను ఈ నెల 22వ తేదీలోపు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాల్సిందిగా సూచించారు.

24న సాంబమూర్తి ఆలయ వార్షికోత్సవం

మునగపాక, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి పల్లపువీధిలోని సాంబమూర్తి ఆలయ వార్షికోత్సవం ఈ నెల 24న జరగనుంది. రెండు రోజుల పాటు వేడుకలు జరగనున్న నేపథ్యంలో ముందు రోజు ఉత్సవ రాట వేయనున్నారు. ఈ సందర్భంగా అన్నమయ్య కీర్తనల ఆలాపన, మహిళల కోలాటం ఉంటాయని ఆలయ కమిటీ చైర్మన్ బూడిద శ్రీనువాసరావు తెలిపారు. సోమవారం స్వామివారికి విశేష పూజలు జరపనున్నామన్నారు.

మునగపాకలో బ్రిడ్జి నిర్మాణానికి భూమి పూజ

మునగపాక, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి-అచ్యుతాపురం రోడ్డు విస్తరణలో భాగంగా మునగపాకలో బ్రిడ్జి నిర్మాణ పనులకు బుధవారం భూమి పూజ జరిపారు. స్థానిక ఆటో స్టాండ్ పెద్ద మదుం వద్ద కొత్త బ్రిడ్జి నిర్మాణానికి కాంట్రాక్టర్ సంస్థ ప్రతినిధులు పూజా కార్యక్రమాలు చేసినట్టు జనసేన మండల శాఖ అధ్యక్షుడు టెక్కలి పరశురాం తెలిపారు. రోడ్డు విస్తరణ వేగవంతం చేసి ప్రమాదాలు నివారణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. ఇందులో భాగంగానే ఈ పనులకు శ్రీకారం చుట్టారన్నారు. రాష్ట్ర తెలుగు రైతు కార్యనిర్వాహక కార్యదర్శి దాడి ముసిలినాయుడు మాట్లాడుతూ పాత బ్రిడ్జి స్థానంలో సుమారు 24 మీటర్లు వెడల్పు కలిగిన బ్రిడ్జి నిర్మాణం జరగనుందన్నారు. సాగునీటి కాలువలో ప్రస్తుతం నీరు లేనందున నిర్మాణానికి అనువుగా ఉందని ఆయన వివరించారు.

అధికారుల దృష్టికి దొప్పెర్ల సమస్యలు

▸▸ పారిశుధ్యం, తాగునీరు తదితరాల కోసం విన్నవించిన గ్రామస్థులు




ఇళ్ల మధ్య తిష్ఠ వేసిన మురుగు

అచ్యుతాపురం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దొప్పెర్లలో సమస్యపై గ్రామస్థులు బుధవారం జిల్లా కలెక్టర్, డీఎంహెచ్‌వో, ఆర్‌డీవోలతో పాటు మండల అధికారులకు ఫిర్యాదులు చేశారు. గ్రామంలో కాలువలు లేకపోవడం వల్ల వాడుక నీరు ఇళ్ల వద్ద తిష్ఠ వేస్తున్నట్టు వివరించారు. ఈ కారణంగా ఓ వైపు దుర్వాసన మరో వైపు దోమల బెడదతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోయారు. అంటువ్యాధులు భయం వెంటాడుతోందన్నారు. అలాగే, మంచి నీటి వసతులు కూడా లేకపోవడంతో అవస్థలు పడుతున్నట్టు వివరించారు. వీటితో పాటు మరిన్ని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకు వెళ్లారు. వెంటనే వీటికి పరిష్కారం చూపాల్సిందిగా వేడుకున్నారు.

ఏప్రిల్ 30న అప్పన్న చందనోత్సవం

▸▸ రూ.1,500, రూ.1,000, రూ.300 టికెట్ల అమ్మకం

▸▸ విశాఖ కలెక్టర్ హరేంధిరప్రసాద్



విశాఖపట్నం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): సింహాచలం వరాహ లక్ష్మీనృసింహస్వామి చందనోత్సవం (నిజరూప దర్శనం) వచ్చే నెల 30వ తేదీన జరుగుతుందని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ తెలిపారు. చందనోత్సవానికి భారీఎత్తున భక్తులు హాజరుకానున్నం దున పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్‌లో చందనోత్సవ ఏర్పాట్లపై రెవెన్యూ, పోలీస్, దేవదాయ, ఇతర శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. దర్శనం టికెట్ల విక్రయ కేంద్రాలు విశాఖలో అనుకూలమైన ప్రాంతాల్లో ఏర్పాటుచేయాలని ఆదేశించారు. దర్శనం కోసం రూ.1,500, రూ.1,000, రూ.300 టికెట్ల అమ్మకం ప్రణాళికాయుతంగా చేపట్టాలన్నారు. వీఐపీలకు అంతరాలయ దర్శనాలపై ప్రభుత్వ అధికారులతో మాట్లాడిన తరువాత నిర్ణయం తీసుకుంటామని ఆయన చెప్పారు.

దివ్యాంగ క్రికెటర్లకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు

విశాఖపట్నం స్పోర్ట్సు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగ క్రికెటర్లతోపాటు అర్హత కలిగిన క్రికెటేతర దివ్యాంగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఏఎంటీజెడ్, ఐడియా, సాక్షం వంటి ప్రముఖ సంస్థలు ముం దుకు వచ్చాయని కౌన్సిల్ కార్యదర్శి సురవరపు రామన్ ఒక ప్రకటనలో తెలిపారు. తొలి దశలో విశాఖ, అనకాపల్లికి చెందిన దివ్యాంగులకు ప్రాధాన్యత ఇస్తూ ఉద్యోగవకాశాలు ఇవ్వనున్నారని పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత గల దివ్యాంగ క్రికెటర్లు, క్రికెటేతర దివ్యాంగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, వివరాలకు 77801 67625 నంబరులో సంప్రదించాలని డీఏసీసీ కమిటీ చైర్మన్ యడ్లపల్లి సూర్యనారాయణ, సభ్యుడు ఇల్లూరి అజయ్‌కుమార్ రెడ్డి తెలిపారు.

భారీ దోపిడీకి స్కెచ్ వేసిన బ్యాంక్ ఉద్యోగి

▸▸ పోలీసుల చాకచక్యంతో నిందితుడు పట్టివేత

▸▸ రెండు పిస్టల్స్, 17 బుల్లెట్లు స్వాధీనం

▸▸ వివరాలు వెల్లడించిన కాకినాడ జిల్లా ఎస్పీ బిందుమాధవ్

సర్పవరం జంక్షన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): అతడో బ్యాంకు ఉద్యోగి. ఆన్‌లైన్ బెట్టింగ్, ఇతర చెడు వ్యసనాల కారణంగా పని చేసే బ్యాంకులో బంగారు ఆభరణాలు చోరీ చేసి నిందితుడిగా మారాడు. అప్పులు తీర్చేందుకు వేరేదారి లేక కష్టపడకుండా సులువుగా డబ్బులు సంపాదించేందుకు చోరీల బాటను ఎంచుకున్నాడు. చిన్నచిన్న చోరీలు చేస్తే ప్రయోజనం లేదని ఏదైనా బ్యాంకు, ఏటీఎంలో చోరీకి పాల్పడి పెద్ద మొత్తంలో దోపిడీ చేస్తే జీవితంలో సెటిల్ అయిపోవచ్చనే దురుద్దేశంతో బీహార్ నుంచి 2 పిస్టల్స్ కొనుగోలు చేశాడు. చోరీకి రెక్కీలు నిర్వహిస్తోండగా మంగళవారం రాత్రి కాజులూరులో రెక్కీ నిర్వహిస్తోండగా కాకినాడ జిల్లా పోలీసులు అప్రమత్తంగా వ్యవహరించి చాకచక్యంగా నిందితుడ్ని పట్టుకున్నారు. 2 పిస్టల్స్ 17 బుల్లెట్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడి అరెస్ట్ వివరాలను బుధవారం సర్పవరం జంక్షన్‌లో గల కాకినాడ రూరల్ సర్కిల్ కార్యాలయంలో సీఐ డీఎస్ చైతన్యకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. విశాఖపట్టణం మద్దిలపాలెం ఫిష్‌మార్కెట్ సమీపంలో గ్రూప్‌హౌస్‌లో చిటికెల నాగేశ్వరరావు, భార్య కుటుంబ సభ్యులతో కలసి నివాసం ఉంటున్నాడు. అతడు గతంలో పశ్చిమ గోదావరి జిల్లా నిడమర్రు చైతన్య గోదావరి గ్రామీణ బ్యా ంకులో ప్రొబిషనరీ ఆఫీసర్‌గా పనిచేసేవాడు. ఈక్రమంలో ఆన్‌లైన్ బెట్టింగ్, చెడు వ్యవసనాల కారణంగా బ్యాంకు నుంచి 900 గ్రాముల బం గారాన్ని బ్యాంకు నుంచి తనకున్న అధికారాన్ని దుర్వినియోగం చేసి సొంత అవసరాలకు వాడుకోవడంతో సస్పెండ్ చేశారు. ఈ సందర్భంగా సుమారు రూ.40 లక్షలు బ్యాంకుకి కట్టేశాడు. అప్పులు తీర్చలేక, చెడు వ్యసనాలకు డబ్బుల్లేక చోరీల బాట పట్టాడు. చిన్న చోరీలతో జీవితంలో స్థిరపడటం సాధ్యం కాదని గ్రహించిన నాగేశ్వరరావు భారీ దోపీడీకి స్కెచ్ వేశాడు. బీహార్ ముంగర్ ప్రాంతానికి వెళ్లి 2పిస్టల్స్, 17 బుల్లెట్లు కొనుగోలు చేశాడు. దాంతో బ్యాంకు, ఏటీఎంల దోపిడి చేసేందుకు విశాఖ సిటీ, రూరల్, నర్సీపట్నం, ఆంధ్ర, తమిళనాడు బోర్డర్‌లలో రెక్కీ నిర్వ హించాడు. ఈ క్రమంలో నేరస్తుడు కాజులూరులో రెక్కీ నిర్వహిస్తున్నాడన్న పక్కా సమాచారంతో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు బుధవారం కాకినాడ జిల్లా పోలీసులు చాకచక్యంగా వ్యవహ రించి నిందితుడ్ని పట్టుకుని, అతడి వద్ద నుంచి 2 పిస్టల్స్, 17 బుల్లెట్లు స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్పీ బిందు మాధవ్ తెలిపారు. నిందితుడు అరెస్ట్‌తో భారీ దోపీడీని పోలీసులు నియంత్రించడం జరిగిందన్నారు. నిందితుడిపై నర్సీపట్నంలో 3 కేసులు, అన్నవరం, నక్కపల్లి, తాడేపల్లిగూడెం, ఏలేశ్వరం పీఎస్‌లో తలో ఓ కేసు వెరసి మొత్తంగా ఒక చైన్ స్నాచింగ్, 4 రాత్రి, పగలు చోరీలు, ఓబైక్ చోరీ కేసులు ఉన్న ట్టు తెలిపారు. నిందితుడ్ని చాకచక్యంగా పట్టుకోవడంలో కీలకంగా పనిచేసిన కాకినాడ రూరల్ సర్కిల్ పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ అభినందించారు. సమావేశంలో ఏఎస్పీ మనీష్ దేవరాజ్ పాటిల్, ఎస్ఐలు ఎంవీవీ రవీంద్రబాబు,ఎం.మోహన్‌కుమార్ పాల్గొన్నారు.

మూలకు చేరిన పంచాయతీ వాహనాలు

చెత్త తరలింపునకు సిబ్బంది అగచాట్లు

ఏడాదిగా మరమ్మతులు చేపట్టని పంచాయతీ

కొన్ని వీధుల్లో ఉన్నచోటే చెత్త దహనం



సగానికి విరిగిపోయిన ట్రాక్టర్ తొట్టె డోర్లు

పాయకరావుపేట, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): పాయకరావుపేట మేజరు పంచాయతీలో చెత్తను తరలించే వాహనాలు మూలకు చేరాయి. సుమారు 30 వేల జనాభా ఉన్న ఈ పంచాయతీలో ఏడాదిగా వాహనాలకు మరమ్మతులు చేపట్టకపోవడంతో రోజూ చెత్తను తరలించేందుకు సిబ్బంది అగచాట్లు పడుతున్నారు. 20 వార్డులు ఉన్న పాయకరావుపేట పంచాయతీలో సుమారు పది వేల అసెస్‌మెంట్లు ఉన్నాయి. రోజూ పట్టణంలో వచ్చే చెత్తను తరలించేందుకు మూడు ట్రాక్టర్లు, నాలుగు మినీ వ్యాన్‌లో, తొమ్మిది రిక్షాలు ఉన్నాయి. పంచాయతీ ప్రజారోగ్య విభాగంలో 68 మంది పనిచేస్తున్నారు. అయితే వీటిలో నాలుగు మినీ వ్యాన్‌లు మరమ్మతులకు గురై మూలకు చేరగా, రెండు ట్రాక్టర్ల తొట్టెల తలుపులు సగానికి విరిగిపోయాయి. దీంతో రోజూ పట్టణంలో ఉత్పత్తి అయ్యే వందల టన్నుల చెత్త, వ్యర్థాలను తరలించేందుకు సరైన వాహనాలు లేక ఏడాదిగా పంచాయతీ సిబ్బంది అవస్థలు పడుతున్నారు. కొన్నిచోట్ల చెత్తను తరలించలేక చెత్త ఉన్నచోటే తగులబెడుతున్నారు. దీనికితోడు వీధుల్లో ఊడ్చిన చెత్తతోపాటు కాలువల్లో నుంచి తీసిన వ్యర్థాలను తరలించేందుకు జాప్యం ఏర్పడడంతో పందులు, కుక్కలు చిందరవందర చేస్తున్నాయి.కాలువల్లోని పూడికతీత పనులు సక్రమంగా లేక పారిశుధ్యం లోపించి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై పంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శి శివరామ్‌ను వివరణ కోరగా పాడైన వాహనాలకు మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తెస్తామని తెలిపారు.



నూకాలమ్మతోట వీధిలో చెత్తను తగులబెట్టడంతో మసిబారిన గోడ



పాయకరావుపేటలో ఏడాది కాలంగా మూలన ఉన్న మినీ వ్యాన్‌లు

టెన్త్ పరీక్షలకు తొమ్మిది మంది గైర్హాజరు

ఎస్. రాయవరం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఐదు పరీక్షా కేంద్రాల్లో పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సంబంధించి బుధవారం తొమ్మిది మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ఎంఈవో స్వప్నప్రియారెడ్డి తెలిపారు. మొత్తం 910 విద్యార్థులు పరీక్షలు రాస్తుండగా హిందీ పరీక్షకు ఎస్.రాయవరం పరీక్షా కేంద్రంలో ముగ్గురు రెగ్యులర్ విద్యార్థులతో పాటు ఒక ప్రవేట్ విద్యార్థి, దార్లపూడి పరీక్షా కేంద్రం ఇద్దరు, కొరుప్రోలు ఇద్దరు, అడ్డరోడ్డు తిమ్మాపురం పరీక్షా కేంద్రాంలో ఒక విద్యార్థి గైర్హాజరయ్యారని ఆయన చెప్పారు.

సబ్ ట్రెజరీ భవనానికి రూ.75 లక్షల మంజూరు

పాత ట్రెజరీ కార్యాలయాన్ని పరిశీలించిన ఎస్‌టీవో



పాత సబ్ ట్రెజరీ భవనాన్ని పరిశీలిస్తున్న ఎస్‌టీవో అనిత

నక్కపల్లి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): నక్కపల్లిలో కొత్త సబ్ ట్రెజరీ కార్యాలయ భవనానికి ప్రభుత్వం రూ.75 లక్షలు మంజూరయ్యాయి. ఈ మేరకు బుధవారం ఎస్‌టీవో అనిత, డీఈ ప్రసాద్, ఏఈ స్వరూప్, మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటేశ్ నక్కపల్లిలో పూర్వం వుండే పాత సబ్ ట్రెజరీ కార్యాలయ భవనాన్ని పరిశీలించారు. హోం మంత్రి అనిత సిఫారసుతో ప్రభుత్వం ఈ నిధులు మంజూరు చేసినట్టు టీడీపీ మండల అధ్యక్షుడు వెంకటేశ్ చెప్పారు. మండల పరిషత్ కార్యాలయం, ఆస్పత్రికి అనుకుని వున్న పాత సబ్ ట్రెజరీ భవనాన్ని తొలగించి, ఆ స్థానంలో కొత్త భవనాన్ని నిర్మిస్తారని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో అమలాపురం సర్పంచ్ పెదపూడి శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో అకడమిక్ ఆడిట్

నక్కపల్లి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం ఏపీ ఉన్నత విద్యా మండలి ఆదేశాల మేరకు అకడమిక్ ఆడిట్ నిర్వహించారు. తుని డిగ్రీ కళాశాల అధ్యాపకులు డాక్టర్ నాగరాజు, డిల్లీశ్వరరావు ఆడిటర్లుగా పలు ఫైళ్లను తనిఖీ చేశారు. ఈ కళాశాలకు బీ గ్రేడ్ కేటాయించినట్టు ఆడిటర్ల బృందం తెలిపింది. ప్రిన్సిపాల్ డాక్టర్ శివయ్య తదితరులు పాల్గొన్నారు.

బైక్ బోల్తాపడి వ్యక్తికి తీవ్ర గాయాలు

రావికమతం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): దొండపూడి చెక్‌పోస్టు వద్ద మంగళవారం రాత్రి ద్విచక్ర వాహనం బోల్తా పడింది. ఈ ఘటనలో రోలుగుంట మండలం వి.శరభవరం గ్రామానికి చెందిన జల్లూరి ఈశ్వరరావు తీవ్రంగా గాయపడ్డాడు. ఎర్రబందలోనిబంధువుల శుభకార్యానికి ఈశ్వర రావు బైక్‌పై వస్తూ అదుపుతప్పి కల్వర్టు గొయ్యిలో పడిపోయాడు. బుధవారం అటుగా వెళ్లిన వారు అతన్ని గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రుడ్ని ఏరియా ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం వైద్యులు కేజీహెచ్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

మెరక గ్రామాల్లో సంపద కేంద్రాల తనిఖీ



జి.జగన్నాధపురం సంపద కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఎంపీడీవో

నక్కపల్లి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మెరక గ్రామాల్లోని సంపద కేంద్రాలను బుధవారం ఎంపీడీవో డి.సీతారామరాజు తనిఖీ చేశారు. గుల్లిపాడు, దోసలపాడు, జి.జగన్నాధపురం, గొడిచెర్ల గ్రామాల్లో సంపద కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కార్యదర్శులకు, గ్రీన్ అంబాసిడర్లకు పలు సూచనలు చేశారు. సేంద్రియ ఎరువుల ఉత్పత్తులను పెంచాలని ఆయన సూచించారు. అనంతరం డొంకాడ సచివాలయం పరిధిలో పర్యటించి గ్రామస్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

యాజమాన్య పద్ధతులతో నష్టాల నివారణ

పాయకరావుపేట రూరల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మిరప సాగులో రైతులు సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే నష్టాలను నివారించుకోవచ్చని మండల వ్యవసాయాధికారి పి.ఆదినారాయణ చెప్పారు. మండలంలోని పెంటకోట, మాసాహెబ్‌పేట గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిరపలో ముడత తెగులు వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. దీని నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలు, సస్యరక్షణ చర్యలను వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది జి.అజయ్, పి.సతీశ్, రైతులు పాల్గొన్నారు.

హత్యకు గురైంది ట్రాన్స్‌జెండర్

... 5వ పేజీ తరువాయి

తల, ఎడమ చేయి కనిపించాయి. వీటిని ప్యాక్ చేసి ఎన్టీఆర్ వైద్యాలయం మార్చురీకి పంపారు. అనంతరం నిందితుడిని వెంటబెట్టుకుని కశింకోట మండలం తాళ్లపాలెం మామిడివాక గెడ్డ వద్దకు వెళ్లారు. అక్కడ మిగిలిన శరీర భాగాలు (మొండెం) వున్న సంచిను అతను చూపించాడు. పంచనామా అనంతరం ఎన్టీఆర్ వైద్యాలయం మార్చురీకి తరలించారు. దీంతో బయ్యవరం వద్ద మంగళవారం లభించిన శరీర భాగాలు మహిళవిగా భావించిన పోలీసులు, బుధవారం మిగిలిన శరీర భాగాలు కూడా లభ్యమైన తరువాత హత్యకు గురైంది ట్రాన్స్‌జెండర్‌గా నిర్ధారించారు.

నాగులాపల్లి అద్దె ఇంటిలోనే హత్య?

ట్రాన్స్ జెండర్ దిలీప్ అలియాస్ దీపును సోమవారం అర్ధరాత్రి నాగులాపల్లిలోని అద్దె ఇంటిలోనే హత్య చేసి, శరీరాన్ని ముక్కలుగా నరికి, బెడ్‌షీట్‌లో, బాక్సులో, సంచిలో వేసుకుని మూడుచోట్ల పడేసినట్టు పోలీసుల విచారణలో బన్నీ చెప్పినట్టు తెలిసింది.

దీపుగా మారిన దిలీప్

హత్యకు గురైన ట్రాన్స్‌జెండర్ అసలు పేరు మైపాలి దిలీప్ శివశంకర్ (40). అనకాపల్లి గవరపాలెంలో ఉన్న ముత్రాసుకాలనీకి చెందిన దిలీప్..ట్రాన్స్‌జెండర్‌గా మారి 'దీపు'గా పేరుమార్చుకున్నాడు. అప్పటి నుంచి తల్లిదండ్రులకు దూరంగా వున్నాడు.

నాలుగేళ్ల నుంచి సహజీవనం

పశ్చిమ గోదావరి జిల్లా ఇరగవరం మండలం పొదలాడకు చెందిన బన్నీ కొన్నేళ్ల క్రితం ఉపాధి నిమిత్తం అనకాపల్లి వచ్చాడు. ఒక ఫుడ్ డెలివరీ కంపెనీలో బాయ్‌గా పనిచేస్తుండగా ట్రాన్స్‌జెండర్ దీపుతో పరిచయం ఏర్పడింది. సుమారు నాలుగేళ్ల నుంచి వీరు సహజీవనం చేస్తున్నట్టు తెలిసింది. ఏడాది క్రితం మునగపాక మండలం నాగులాపల్లిలో ఒక ఇల్లు అద్దెకు తీసుకుని నివాసం వుంటున్నారు. వీరిరువురూ తరచూ గొడవ పడుతూ ఉండేవారని స్థానికులు చెబుతున్నారు. కాగా కేసుకు సంబంధించి పూర్తి వివరాలను గురువారం మీడియాకు వెల్లడిస్తామని పోలీసు అధికారులు చెప్పారు.

జిల్లాలో వైద్య బోధన ఆస్పత్రి ఏర్పాటు చేయాలి

▸ కష్ట కాలంలో రాష్ట్రానికి విజనరీ సీఎం చంద్రబాబునాయుడు ఉండడం ప్రజల అదృష్టం

▸ అసెంబ్లీలో ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ



అనకాపల్లి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): కొత్తగా ఏర్పడిన అనకాపల్లి జిల్లాలో వైద్య బోధన (మెడికల్ టీచింగ్) ఆస్పత్రిని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అన్నారు. బుధవారం అసెంబ్లీ సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ విశాఖలో గల విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (విమ్స్)ను సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిగా మార్చాలన్నారు. గైనిక్ విభాగాలను మెరుగు పర్చాలని కోరారు. రాష్ట్రంలో పేరుకుపోయిన అప్పులను తీరుస్తూ.. అభివృద్ధి బాటలో నడిపించడం సాహసోపేతమైన చర్యగా అభివర్ణించారు. ఇటువంటి ఇబ్బందుల్లో విజనరీ సీఎం చంద్రబాబునాయుడు ఉండడం రాష్ట్ర ప్రజల అదృష్టంగా పేర్కొన్నారు. మంచి ప్రతిపాదన తీసుకొచ్చి అభివృద్ధి, సంపద సృష్టి వైపు తీసుకెళుతున్న సీఎం చంద్రబాబునాయుడుకు జనసేన పార్టీ నుంచి తన పూర్తి మద్దతు ఉంటుందని కొణతాల స్పష్టం చేశారు.

లారీల యజమానులు నిబంధనలు పాటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ విష్ణు స్వరూప్

పరవాడ, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : సింహాద్రి ఎన్టీపీసీ, హిందూజా పవర్ ప్లాంట్‌ల నుంచి బూడిదను తీసుకు వెళ్లే లారీల యాజమానులతో పాటు హిందూజా పవర్‌ప్లాంట్‌కు బొగ్గును రవాణా చేసే లారీ యజమానులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని పరవాడ డీఎస్పీ వల్లెం విష్ణు స్వరూప్ సూచించారు. ఇక్కడి పోలీస్ స్టేషన్‌లో బుధవారం లారీ ట్రాన్స్‌పోర్టు యజమానులు, సింహాద్రి ఎన్టీపీసీ, హిందూ పరిశ్రమల ప్రతినిధులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రతిరోజూ ఉదయం 7.30 గంటల నుంచి 9.30 గంటల వరకు, సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 7.30 గంటల వరకు లారీలు లంకెలపాలెం కూడలికి చేరకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పైన పేర్కొన్న సమయాల్లో ట్రాఫిక్ ఎక్కువగా ఉంటుందని, దీనిని దృష్టిలో పెట్టుకొని లారీలను ఎట్టి పరిస్థితుల్లో లంకెలపాలెం కూడలికి చేరకుండా చూసుకోవాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని పునరుద్ఘాటించారు. ఈ సమావేశంలో సీఐ ఆర్.మల్లికార్జునరావు, ఎస్ఐ బి.కృష్ణారావు పాల్గొన్నారు.

టెన్త్ హిందీ పరీక్షకు 20,696 మంది హాజరు

అనకాపల్లి రూరల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి పరీక్షలను జిల్లాలో అధికారులు పకడ్బందీగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం జరిగిన హిందీ పరీక్షకు రెగ్యులర్ విద్యార్థులు 20,670మంది, ప్రైవేటు విద్యార్థులు 26 మంది హాజరయ్యారు. జిల్లా వ్యాప్తంగా 107 కేంద్రాల్లో నిర్వహిస్తున్న ఈ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరుగుతున్నట్టు డీఈవో అప్పారావునాయుడు తెలిపారు.

'విద్యుత్ శాఖలో ఖాళీలు భర్తీ చేయాలి'



ఎన్నికైన కార్యవర్గ సభ్యులతో యూనియన్ సభ్యులు

తుమ్మపాల, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ శాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే భర్తీచేయాలని డిస్కం జనరల్ సెక్రటరీ జీఎస్ఆర్‌కే గణపతి కోరారు. బుధవారం ఇక్కడ జరిగిన ఆంధ్రప్రదేశ్ విద్యుత్ ఎంప్లాయీస్ యూనియన్ (1104) సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. గతం కంటే నేడు టెక్నాలజీ అభివృద్ధి చెందిందని, దీనిపై సిబ్బంది అవగాహన పెంచుకోవాలని సూచించారు. గత ప్రభుత్వం జిల్లాలు విభజన చేయడంతో విద్యుత్ శాఖ సిబ్బందికి తీవ్ర నష్టం జరిగినట్టు చెప్పారు. అయినప్పటికీ యూనియన్ ద్వారా పలు పోరాటాలు చేసి సమస్యలను పరిష్కరించుకోవడం జరిగిందన్నారు. అనంతరం అనకాపల్లి బ్రాంచ్ ఎన్నికలు నిర్వహించారు. బ్రాంచ్ అధ్యక్షుడిగా పడాల సోమన్నదొర, కార్యదర్శిగా నూకరాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా తేలపు వెంకట రాంబాబు, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా ఒ.శ్రీనివాసరావు, సీహెచ్‌వీ సత్యనారాయణ, సీహెచ్‌వీవీ కుమార్, కోశాధికారిగా వెంపల శంకరరావు, ఉపాధ్యక్షుడుగా చవితిన నరసింగరావు, కరణం ఈశ్వరరావు, రీజనల్ అసిస్టెంట్ సెక్రటరీగా పి.కుంచుబాబు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి అంతా పోరాటం చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	87.00
లైవ్ ధర	107.00
విత్ స్కిన్	184.00
స్కిన్ లెస్	194.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	415
విజయనగరం	419
శ్రీకాకుళం	419

ట్రాన్స్‌జెండర్లు రాస్తారోకో

▸ తోటి ట్రాన్స్‌జెండర్ దీపును హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ ▸ నిందితుడి ఫ్లెక్సీ దహనం



అనకాపల్లి నెహ్రూచౌక్‌లో మానవహారంగా ఏర్పడిన ట్రాన్స్‌జెండర్లు



నిందితుడి ఫ్లెక్సీ దహనం దృశ్యం

అనకాపల్లి టౌన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని బోయగూడెంకు చెందిన దీపు అనే ట్రాన్స్ జెండర్ కిరాతకంగా హత్యకు గురైన విషయాన్ని తెలుసుకున్న అనకాపల్లి పరిసర ప్రాంతాల ట్రాన్స్‌జెండర్లు బుధవారం పట్టణంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. ఆమె శరీర భాగాలను పోలీసులు గుర్తించి ఎన్టీఆర్ వైద్యాలయంలోని పోస్టుమార్టం గదిలో పెట్టడంతో వారంతా వైద్యాలయానికి చేరుకుని, అక్కడ ఆందోళన ప్రారంభించారు. నిందితుడిగా పేర్కొంటున్న వ్యక్తి ఫ్లెక్సీని చెప్పులతో కొట్టడమే కాకుండా కాళ్లతో తన్నుతూ నెహ్రూచౌక్‌కు చేరుకొని మానవహారంగా ఏర్పడ్డారు. హత్యకు గురైన ట్రాన్స్‌జెండర్ కుటుంబానికి న్యాయం చేయాలంటూ నల్ల రిబ్బన్లను కళ్లకు కట్టుకొని నినాదాలు చేశారు. అంతేకాకుండా నిందితుడిగా పేర్కొంటున్న వ్యక్తి ఫ్లెక్సీని దహనం చేశారు. నిందితున్ని ఉరి తీయాలని డిమాండ్ చేశారు. గతంలో ట్రాన్స్‌జెండర్లు మృతిచెందినా సరైన న్యాయం జరగలేదని వాపోయారు. దీపును హతమార్చిన నిందితున్ని కఠినంగా శిక్షించాలన్నారు. ఈ ఆందోళనతో కొంతసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. పోలీసులు సర్దిచెప్పడంతో వారు శాంతించి డీఎస్పీ పిలుపు మేరకు కొత్తూరులో ఉన్న ఆమె కార్యాలయానికి ప్రదర్శనగా వెళ్లారు. ఇదిలావుంటే, ట్రాన్స్‌జెండర్‌ను కిరాతకంగా హతమార్చిన వ్యక్తిని ఉరి తీయాలని మాజీ ఎమ్మెల్సీ టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బుద్ద నాగ జగదీశ్వరరావు పోలీస్ అధికారులను కోరారు. బోయగూడెంకు చెందిన ట్రాన్స్‌జెండర్ హత్యకు గురికావడంతో ఆయన పోలీస్ అధికారులను కలవడంతో పాటు డీఎస్పీతో ఫోన్‌లో మాట్లాడారు. భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే నాగులాపల్లి జంక్షన్ నుంచి జలగలమదుం జంక్షన్ వరకు ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా పోలీసులు పటిష్టమైన నిఘా పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో భోగలింగేశ్వరస్వామి ఆలయ చైర్మన్ కాండ్రేగుల సత్యనారాయణ, బీసీ నాయకులు కాండ్రేగుల రవీంద్ర పాల్గొన్నారు.

ఉపాధి కూలీలు ఆందోళన



సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేస్తున్న కూలీలు

పరవాడ, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ గొర్లివానిపాలెంలో ఉపాధి కూలీలు బుధవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ కూలీలకు ఏడాదికి రెండు వందల రోజుల పనిదినాలు కల్పించాలని, రోజుకు రూ.600లు వేతనం చెల్లించాలని, పే స్లిప్‌లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న కూలీల బిల్లులను తక్షణమే విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

బ్యాంక్ ఉద్యోగుల సమ్మెకు సీఐటీయూ మద్దతు

అనకాపల్లి టౌన్ : దేశవ్యాప్తంగా ఈ నెల 24, 25 తేదీల్లో బ్యాంక్ ఉద్యోగులు చేపట్టనున్న సమ్మెకు సీఐటీయూ మద్దతు పలికింది. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను బుధవారం ఇక్కడ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.శంకరరావు మాట్లాడుతూ ప్రభుత్వరంగ బ్యాంకుల్లో ఖాళీలను భర్తీ చేయకుండా ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన ఉద్యోగులను నియమించాలని చూస్తుండడం తగదన్నారు. బ్యాంకుల సంఖ్య తగ్గించి, ఉద్యోగులపై పనిభారం పెంచుతుండడం తగదన్నారు. పెద్ద పెద్ద పారిశ్రామికవేత్తల అప్పులను మాఫీ చేసి బ్యాంకుల నెత్తిన ప్రభుత్వం భారాలు మోపుతుందని, దీనికి నిరసనగా సదరు ఉద్యోగులు చేస్తున్న సమ్మెకు పూర్తి మద్దతునిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు పరమేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యుడు పి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సాగు హక్కులు కాపాడాలని ధర్నా



అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆదివాసీలు, సంఘాల నాయకుల ధర్నా

అనకాపల్లి టౌన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : గొలుగొండ మండలంలోని గదబపాలెం ఆదివాసీలు తమ సాగు హక్కులను కాపాడాలంటూ బుధవారం పట్టణంలోని నెహ్రూచౌక్‌లో గల అంబేడ్కర్ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాత మల్లంపేట గ్రామం సర్వే నంబరు 850-1లోని మెట్టభూములను గత ఐదు దశాబ్దాలుగా సాగు చేసుకుంటున్నామన్నారు. ఈ భూములను గొలుగొండ తహసీల్దార్ అమెరికా వెళ్లిపోయిన వ్యక్తుల పేరున సాగు అనుభవంలో ఉన్నట్టు తప్పుడు నివేదిక సృష్టించి, భూమి రికార్డులను మార్చివేశారని ఆదివాసీలతో పాటు సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి బుగత బంగార్రావు ఆరోపించారు. దీనిపై జిల్లా కలెక్టర్ స్వయంగా విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా నాయకుడు రాజాన దొరబాబు, దళిత సమన్వయ కమిటీ జిల్లా కార్యదర్శి ఎగ్గాడ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

వివాహిత అనుమానాస్పద మృతి



కుసుమ (ఫైల్)

కశింకోట, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : వరకట్నం వేధింపులు తాళలేక ఓ వివాహిత అనుమానాస్పదంగా మృతి చెందిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకొచ్చింది. ఇందుకు సంబంధించిన ఎస్ఐ మనోజ్‌కుమార్ తెలిపిన వివరాలివి. విశాఖపట్నం జిల్లా పాత గాజువాక ప్రాంతానికి చెందిన గోలుకొండ కొండలరావు తన కుమార్తె అయిన కుసుమ (25)ను కశింకోట మండలం కన్నూరుపాలెం రామాలయం వీధికి చెందిన గులిమి శివకు ఇచ్చి 2019 ఫిబ్రవరి 13న వివాహం చేశారు. ఆ సమయంలో రూ.2,50,000 నగదు, ఐదు తులాల బంగారు ఆభరణాలు, బైక్ ఇచ్చారు. వివాహం అయిన కొన్నాళ్లపాటు వీరు ఆనందంగానే గడిపారు. వీరికి ఇద్దరు కుమారులు జన్మించారు. గత కొంత కాలంగా భర్త శివ, అత్త అమరావతి, మామ గులిమి శ్రీనివాస్, బావ కృష్ణ కలిసి అదనపు కట్నం తీసుకురావాలని కుసుమను మానసికంగా ఇబ్బందులకు గురిచేసే వారని ఎస్ఐ వివరించారు. దీంతో మంగళవారం సాయంత్రం కుసుమ బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్టు కుమార్తె అత్తవారి ఇంటి నుంచి ఫోన్ వచ్చినట్టు మృతురాలు తండ్రి ఫిర్యాదు చేశారన్నారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్ట ఎస్ఐ చెప్పారు.

79వ వార్డులో నీటి సమస్య లేకుండా చర్యలు



పైప్‌లైన్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ శ్రీనివాస్

పరవాడ, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 79వ వార్డు పరిధిలో తాగునీటి సమస్య లేకుండా చర్యలు చేపడుతున్నామని కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ తెలిపారు. దేశపాత్రునిపాలెం శివారు సాయినగర్ కాలనీలో తాగునీటి పైప్‌లైన్ నిర్మాణానికి బుధవారం శంకుస్థాపన చేసి మాట్లాడారు. పైప్‌లైన్ నిర్మాణ పనులను సకాలంలో పూర్తిచేయాలన్నారు. వార్డులో పూర్తిస్థాయిలో మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా పనిచేస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులతో పాటు, తాగునీటి సరఫరా విభాగం అధికారులు పాల్గొన్నారు.

నేడు పరదేశమ్మ ఆలయంలో వేడుక



సబ్బవరం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం సబ్బవరం శివారు ఆదిరెడ్డిపాలెంలో పరదేశమ్మ ఆలయ మొదటి వార్షికోత్సవం గురువారం జరగనుంది. ఇందుకు సంబంధించి భారీ ఏర్పాట్లు చేపట్టినట్టు నిర్వాహకులు తెలిపారు. వేకువజాము నుంచి పూజలు ప్రారంభం కానున్నాయన్నారు. అలాగే, గొల్లలపాలెంలో కొలువుదీరిన దుర్గమాంబ అమ్మవారి అనుపోత్సవం నేత్రపర్వంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తిచేశారు.

రేషన్ కార్డుదారులకు ఈకేవైసీ తప్పనిసరి

పరవాడ, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలో గల రేషన్ కార్డుదారులంతా ఈనెల 31వ తేదీ లోగా ఆధార్ కార్డుకు ఈకేవైసీ నమోదును తప్పనిసరిగా చేసుకోవాలని తహసీల్దార్ ఎస్‌వీ అంబేడ్కర్ బుధవారం తెలిపారు. రేషన్‌కార్డులో పేర్లున్న ఐదేళ్ల పైబడి 60 ఏళ్ల లోపు వయస్సు ఉన్న వాంతా సమీపంలోని రేషన్ డిపో డీలర్ వద్దకు వెళ్లి తమ ఆధార్‌తో ఈకేవైసీని నమోదు చేయించుకోవాలన్నారు.

స్వయం ఉపాధి రుణాలకు దరఖాస్తులు

పరవాడ, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : వివిధ కార్పొరేషన్‌ల ద్వారా స్వయం ఉపాధి రుణాల కోసం అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని పరవాడ ఇన్ చార్జి ఎంపీడీవో కె.ధర్మారావు బుధవారం తెలిపారు. మండలంలోని బీసీ, కాపు, ఈబీసీ, కమ్మ, రెడ్డి, ఆర్య వైశ్య, క్షత్రియ, బ్రాహ్మణ కార్పొరేషన్లకు సంబంధించి వ్యవసాయం/అనుబంధ, రవాణా, పరిశ్రమలు, సేవలు, వ్యాపార రంగాల్లో రుణాలు ఇవ్వనున్నట్టు చెప్పారు. ఈనెల 22 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకునే గడువు ఉందన్నారు.

గంజాయి నిందితుల కోసం గాలింపు

సబ్బవరం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జాతీయ రహదారి మర్రిపాలెం వద్ద మంగళవారం గంజాయి రవాణా చేస్తూ పట్టుబడి తప్పించుకుపోయిన నిందితుల కోసం ప్రత్యేక బృందం విస్తృతంగా గాలిస్తున్నదని సీఐ పిన్నింటి రమణ బుధవారం తెలిపారు. గంజాయి కేసును ఛేదించేందుకు, కేసు వెనుక ఉన్న ముఖ్యమైన నిందితులను పట్టుకునేందుకు మహా రాష్ట్ర పుణెకు చెందిన శుభం, ఒడిశాకు చెందిన చంటిబాబు, అల్లూరి జిల్లాకు చెందిన వెంకటేశ్ కీలకమన్నారు. వీరు ముగ్గురూ పట్టుబడితే కేసులో కీలక విషయాలు బయటకు వస్తాయన్నారు.

మండుతున్న ఎండలతో జనం బెంబేలు..

▸ జిల్లాలో రోజు రోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

▸ మధ్యాహ్నం బయటకు రావాలంటేనే భయం

అనకాపల్లి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో గడిచిన వారం రోజులుగా ఎండలు మండిపోతున్నాయి. కొద్ది రోజులుగా సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతుండడంతో ప్రజలు బయటకు రావాలంటేనే బెంబేలెత్తిపోతున్నారు. మూడు రోజులుగా అన్ని మండలాల్లో 35 డిగ్రీల నుంచి 40 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. మధ్యాహ్నం వేళ జనం పనులపై బటకు రావాల్సి వస్తే పనులు వాయిదా వేసుకొంటున్నారు. బుధవారం జిల్లాలో అత్యధికంగా నాతవరంలో 39.8 డిగ్రీలు, నర్సీపట్నం, రావికమతంలలో 39.3 డిగ్రీలు, మాడుగులలో 38.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అనకాపల్లిలో 37.7 డిగ్రీలు, మాకవరపాలెంలో 37.4 డిగ్రీలు, మునగపాకలో 37.1, నక్కపల్లిలో 35.2, పరవాడలో 34.7, పాయకరావుపేటలో 33.9, రాంబిల్లి లో 31.8, రోలుగుంటలో 37.6, ఎస్.రాయవరంలో 34.7, సబ్బవరంలో 36.5, ఎలమంచిలిలో 34.2, కోటవురట్లలో 37.1, కశింకోటలో 36.8, కె.కోటపాడులో 35.6, గొలుగొండలో 36.8, దేవరాపల్లిలో 36.4, చోడవరంలో 35, చీడికాడలో 36.9, బుచ్చెయ్యపేటలో 37.5, అచ్యుతాపురంలో 35.4 డిగ్రీ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఎండల తీవ్రత ఎక్కువగా ఉండడంతో ఉదయం, సాయంత్రం పూట మాత్రమే రహదారులు సందడిగా కనిపిస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో వృద్ధులు, చిన్నారులు ఉక్కపోతతో విలవిల్లాడుతున్నారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున తప్పనిసరి పరిస్థితుల్లో బయట తిరగాల్సిన వారు తగిన జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు.

అది గుండెనొప్పి కావచ్చు.. అశ్రద్ధ వద్దు

▸ అవగాహన సదస్సులో కార్డియాలజిస్ట్ డాక్టర్ వాసుబాబు



సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ వాసుబాబు

అనకాపల్లి టౌన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): గ్యాస్ నొప్పిని అశ్రద్ధ చేయొద్దని, అది గుండెనొప్పి కావచ్చునని ప్రముఖ కార్డియాలజిస్ట్ దేవాల వాసుబాబు సూచించారు. స్థానిక వివేకానంద హాల్‌లో బుధవారం ఉత్తరాంధ్ర గ్రామీణ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో కిమ్స్ ఐకాన్ ఆస్పత్రి సహకారంతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా గుండె వైద్యనిపుణుడు వాసుబాబు మాట్లాడుతూ ఛాతీలో వచ్చే నొప్పి గ్యాస్ నొప్పి అని నిర్లక్ష్యం చేయకుండా పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. గ్యాస్ట్రిక్‌కు సంబంధించిన లక్షణాలను గ్యాస్ట్రిక్ వైద్యులు గంగాధర్ వివరించారు. వైద్యుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు జంగం జోషి మాట్లాడుతూ గ్రామీణ వైద్యులకు ప్రతి రెండు నెలలకు వైద్య అవగాహన సదస్సులు నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నితీశ్‌రెడ్డి, అల్లాడ త్రినాథరావు, ఎం.కృష్ణ, కోన ప్రకాశ్, వీరభద్రరావు, రాజు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన కాఫీ ఉత్పత్తితో మరింత ఆదాయం

- కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్
- 425 మంది కాఫీ రైతులకు రాయితీపై పరికరాలు పంపిణీ

పాడేరు, మార్చి 19(ఆంధ్రజ్యోతి): గిరిజన రైతులు నాణ్యమైన కాఫీని ఉత్పత్తి చేసి ఆర్థికంగా లబ్ధి పొందాలని కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ సూచించారు. మండలంలోని మినుములూరు కాఫీ బోర్డు కార్యాలయంలో బుధవారం నిర్వహించిన రాయితీ పరికరాల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. గిరిజన రైతులు కాఫీ గింజలను పల్పింగ్ చేసి నాణ్యమైన పార్చ్‌మెంట్ తయారు చేయడం ద్వారా చక్కని ఆదాయాన్ని పొందవచ్చునని అన్నారు.

రూ.4.99 కోట్ల విలువైన పరికరాలు పంపిణీ

కొయ్యూరు మండలం మినహా పది మండలాల పరిధిలో ఎంపిక చేసిన 425 మంది మహిళా కాఫీ రైతులకు రూ.4 కోట్ల 99 లక్షల 37 వేల 500 విలువ చేసే వ్యవసాయ పరికరాలను అందించారు. రూ.లక్షా 25 వేల 80 విలువ గల పల్పర్ యూనిట్, నిచ్చెన, డ్రయింగ్ యార్డ్, టార్పలిన్‌ను మహిళా రైతులకు 15 శాతం రాయితీపై అందించారు. మిగిలిన 85 శాతం సొమ్ములో 50 శాతం కాఫీ బోర్డు, 35 శాతం పీఎం ఫుడ్ ప్రాసెసింగ్ పథకంలో అందిస్తారు. మొత్తంరూ.4 కోట్ల 99 లక్షలు ప్రస్తుతానికి యూనియన్ బ్యాంక్ రుణంగా మంజూరు చేయగా, ఆయా నమూనా చెక్కును కలెక్టర్, జేసీ అభిషేక్‌గౌడ తదితరులు మహిళా రైతులకు అందించారు. కాఫీ బోర్డు డైరెక్టర్ కురుసా ఉమామహేశ్వరావు, డి ప్యూటీ డైరెక్టర్ మురళీకృష్ణ, ఎస్ఎల్‌వో ఎస్.రమేశ్, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పీడీ వి.మురళి, యూనియన్ బ్యాంక్ ఆర్ఎం నరేశ్, పీఎం ఫుడ్ ప్రాసెసింగ్ సంస్థ ప్రతినిధి శ్రీనివాస్, సర్పంచ్ లంకెల చిట్టెమ్మ, పాల్గొన్నారు.



కాఫీ పల్పింగ్ యూనిట్లను అందిస్తున్న కలెక్టర్, జేసీ, తదితరులు

రైతులకు వ్యవసాయ రుణ పరపతి పెంచండి

రైతులకు రుణ పరపతి పెంచి పెద్ద ఎత్తున రుణాలు అందించాలని కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ అన్నారు. బ్యాంకర్లు, వ్యవసాయానుబంధ శాఖల అధికారులతో బుధవారం నిర్వహించిన జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. 2024-25లో రూ. 672 కోట్లు రుణ లక్ష్యంలో డిసెంబరు త్రైమాసానికి రూ.607 కోట్ల రుణాలను అందించారని, మిగిలిన రూ.90.43 కోట్ల రుణాలను ఇకపై అందించాలన్నారు. రుణాల వృద్ధి రేటు పెరగాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీ కార్పొరేషన్ వెబ్‌సైట్ ఓపెన్ చేసిందని, రుణ లక్ష్యం మేరకు వెనుకబడిన వర్గాలకు రుణాలు అందించాలన్నారు. విశ్వకర్మ పథకంలో 274 దరఖాస్తులు రాగా, 42 మందికి మాత్రమే రుణాలు మంజూరు చేశారని, మిగిలిన వారికి రుణాలు అందించాలని పరిశ్రమల శాఖ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో యూనియన్ బ్యాంకు రీజనల్ అధికారి పి.నరేశ్, ఎల్‌డీఎం మాతు నాయుడు, నాబార్డు డీడీఎం చక్రధర్, గ్రామీణ బ్యాంకు ఆర్ఎం ఎస్.సతీశ్‌చంద్ర, డీఆర్‌డీఏ పీడీ వి.మురళి, జిల్లా వ్యవసాయాధికారి ఎస్‌బీఎస్.నంద్, జిల్లా ఉద్యానవనాధికారి రమేశ్‌కుమార్‌రావు, జిల్లా సెరీ కల్చర్ అధికారి అప్పారావు, పశు సంవర్ధకశాఖ డీడీ నరసింహులు, వివిధ బ్యాంకు అధికారులు, డీఆర్‌డీఏ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి: ఎస్పీ

అరకులోయ, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ కుటుంబాలకు ఆసరాగా నిలవాలని ఎస్పీ అమిత్‌బర్దార్ పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం సంకల్ప్ కార్యక్రమం అమలులో భాగంగా ఏజెన్సీలోని మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలకు చెందిన పలువురు గిరిజన నిరుద్యోగ యువతులకు స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సహకారంతో టైలరింగ్ శిక్షణ అందించారు. ఈకార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎస్పీ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.. మహిళలు స్వావలంబనతో కుటుంబాలకు ఆర్థిక దన్నుగా ఉండాలన్నారు. పిల్లలకు భవిష్యత్తు ఇవ్వాలని కోరారు. పోలీస్‌శాఖ ద్వారా కల్పిస్తున్న ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అనంతరం టైలరింగ్ శిక్షణ పూర్తిచేసిన అరకు, అనంతగిరి, డుంబ్రిగుడ, పెదబయలు, ముంచంగిపుట్టు, జీకె.వీధి, కొయ్యూరు మండలాలకు చెందిన 115 మంది గిరిజన యువతులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలోని డీఎస్పీ ఎస్‌కే షెహబాజ్, జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారిణి రోహిణి, తదితరులు పాల్గొన్నారు.



టైలరింగ్ శిక్షణ పూర్తిచేసిన యువతులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎస్పీ అమిత్‌బర్దార్, డీఎస్పీ షెహబాజ్, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి

రికార్డుల నిర్వహణలో అలసత్వం వద్దు: జడ్పీ డిప్యూటీ సీఈవో

ముంచంగిపుట్టు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): రికార్డుల నిర్వహణ పక్కాగా ఉండాలని విశాఖ ఉమ్మడి జిల్లా జడ్పీ డిప్యూటీ సీఈవో కె.రాజ్‌కుమార్ హెచ్చరించారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయాన్ని బుధ వారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. రికార్డులను తనిఖీ చేశారు. కార్యాలయ సిబ్బంది హాజరు, ఇళ్ల పన్ను వసూలు, పంచాయతీల నిర్వహణ,పారిశుధ్య వివరాలతోపాటు మొత్తం 32 రికార్డులను తనిఖీ చేశారు. పంచాయతీల తీర్మానాలు పరిశీలించారు. సిబ్బంది వివరాలు అడిగి తెలుసుకున్నారు. జడ్పీ అతిథి గృహం ప్రస్తుత పరిస్థితిపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల ప్రజా పరిషత్ ద్వారా జరిగే అభివృద్ధి పనులు, నిధుల వివరాలన్నీ తప్పని సరిగా రికార్డుల్లో ఉండాలని ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో సూర్యనారాయణమూర్తి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.



మండల పరిషత్ కార్యాలయంలో రికార్డులు తనిఖీ చేస్తున్న డిప్యూటీ సీఈవో రాజ్‌కుమార్

ఆదివాసీల అభివృద్ధే సీఆర్‌పీఎఫ్ లక్ష్యం

చింతపల్లి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీల సామాజిక అభివృద్ధికి సీఆర్‌పీఎఫ్ ప్రత్యేక కృషి చేస్తోందని స్థానిక 234 బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ డి.వినీత అన్నారు. బుధవారం మండలంలోని డైరీనగర్ గ్రామాన్ని సీఆర్‌పీఎఫ్ జవాన్లు సందర్శించారు. ఆదివాసీలు పుష్పగుచ్ఛాలతో వారికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వినీత మాట్లాడుతూ డైరీనగర్ గ్రామాన్నిదత్తత తీసుకుంటామన్నినరు. గ్రామంలో వసతులు సదుపాయాలు కల్పిస్తామన్నారు. గిరిజనులందరినీ అక్షరాస్యులుగా తీర్చిదిద్దుతామన్నారు. డైరీనగర్‌ని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దుతామన్నారు. ఎంపీపీ కోరాబు అనుషదేవి, సర్పంచి దురియా పుష్పలత చేతులమీదుగా లవ్ అండ్ కేర్ మినిస్ట్రీస్ సమకూర్చిన రగ్గులను గిరిజనులకు అసిస్టెంట్ కమాండెంట్ అందజేశారు. అనంతరం గిరిజనులతో సహపంక్తి భోజనాలు చేశారు. ఈ కార్యక్రమలో వైసీపీ మండలాధ్యక్షుడు మోరి రవి, కూటమి నాయకుడు రీమల ఆనందరావు, అభ్యుదయ రైతు కరుణానిధి పాల్గొన్నారు.

రెవెన్యూ సర్వీసెస్ డైరీ ఆవిష్కరణ



డైరీ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ దినేశ్‌కుమార్, తదితరులు

పాడేరు, మార్చి 19(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సర్వీసెస్ - 2025 డైరీని కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ బుధవారం తన ఛాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, డైరీలో రెవెన్యూ సేవలకు సంబంధించిన పలు అంశాలను, జీవోలు, ఉత్తర్వులను పొందుపర్చడం అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.పద్మావతి, రెవెన్యూ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి వి.త్రినాధరావు నాయుడు, సంయుక్త కార్యదర్శి శ్రీనివాసరావు, సభ్యులు పాల్గొన్నారు.

గంజాయితో వ్యాపారి అరెస్టు

సీలేరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): గూడెంకొత్తవీధి మండలం సీలేరు ఐటీఐ జంక్షన్ వద్ద రెండు కిలోల గంజాయితో వ్యాపారిని అరెస్టు చేసినట్టు స్థానిక ఎస్ఐ రవీంద్ర తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ముందస్తుసమాచారం మేరకు మంగళ వారం సాయంత్రం ఐటీఐ జంక్షన్ వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానితంగా తిరుగుతున్న తమిళనాడులోని మధురై జిల్లా ఉసిలంపట్టి తాలూకా ఇదయ్యపట్టి గ్రామానికి చెందిన కుమరేసన్ పొన్నుసామిని అదుపులోకి తీసుకున్నామన్నారు. అతనినుంచి గంజాయి, కీప్యాడ్, మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నామన్నారు. అలాగే, నిందితుడికి గంజాయి విక్రయించిన ఒడిశామల్కన్‌గిరి జిల్లా కలిమెల బ్లాక్ పసుపులంకకుచెందిన కిల్లోమహదేవ్‌పైనాకేసు నమోదు చేశామన్నారు.

విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు

అనంతగిరి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): సచివాలయ ఉద్యోగులు విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని ఎంపీడీవో ఏవీవీ.కుమార్ హెచ్చరించారు.. మండలంలోని చిలకలగెడ్డ సచివాలయాన్ని ఆయన బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయం ద్వారా ప్రజలకు అందుతున్న సేవలపై ఆరా తీశారు.. అనంతరం రికార్డులను పరిశీలించారు. ఎనిమిది మంది సిబ్బంది క్షేత్రస్థాయి పర్యటనకు వెళుతున్నట్లుగా నమోదు చేసి, మూమెంట్ రిజిస్టర్ ఎక్కడికి వెళ్లారనేది స్పష్టం చేయకపోవడంపై ఆయన అసంతృప్తి వ్యక్తంచేశారు. ఇకపై సిబ్బంది క్షేత్రస్థాయి పర్యటనకు వెళ్లినప్పుడు తప్పనిసరిగా మూమెంట్ రిజిస్టర్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. సర్వేలను త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు.

గంజాయి నిందితుల కోసం గాలింపు

సబ్బవరం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మర్రిపాలెం వద్ద మంగళ వారం గంజాయి రవాణా చేస్తూ పట్టుబడి తప్పించుకుపోయిన నిందితుల కోసం ప్రత్యేక బృందం విస్తృతంగా గాలిస్తున్నదని సీఐ పిన్నింటి రమణ తెలిపారు. ఈ కేసు లో నిందితులు మహారాష్ట్ర పుణెకు చెందిన శుభం, ఒడిశాకు చెందిన చంటిబాబు, అల్లూరి జిల్లాకు చెందిన వెంకటేశ్ కీలకమన్నారు.

ఆర్గానిక్ పంటలకు అధిక ధర

చింతపల్లి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): గిరిజన రైతులు ఆర్గానిక్ పద్ధతిలో పంటలు పండించాలని స్థానిక ఎంపీపీ కోరాబు అనుషదేవి అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఏపీసీఎన్ఎఫ్ అధికారులు ఏర్పాటు చేసిన ఆర్గానిక్ కూరగాయల స్టాల్‌ను ఎంపీపీ ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఆర్గానిక్ ఉత్పత్తులకు మార్కెట్‌లో అధిక ధర లభిస్తుందన్నారు. ఎంపీడీవో యూఎస్‌వీ శ్రీనివాసరావు, సర్పంచి దురియా పుష్పలత, ఏవో మధుసూదనరావు, ఏపీసీఎన్ఎఫ్ డివిజన్ ఇన్‌చార్జి కె. వెంకట్, యూనిట్ ఇన్‌చార్జీలు కొర్ర మోహన్‌రావు, ఐసీఆర్‌పీ బొజ్జిపడాల్, రెడ్డి విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

పటిష్ఠంగా ఆదివాసీ చట్టాల అమలుకు కృషి

పాడేరురూరల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): నూతనంగా ఎంపికైన పెసా కమిటీ ప్రతినిధులు ఆదివాసీ చట్టాలను పటిష్ఠంగా అమలుకు కృషి చేయాలని రాష్ట్ర పంచాయతీ ఛాంబర్ ఉపాధ్యక్షుడు బొర్రా నాగరాజు కోరారు. బుధవారం మోదకొండమ్మ ఆలయ ప్రాంగణంలో సల్లా రామకృష్ణ, పాలికి లక్కు ఆధ్వర్యంలో నిర్వహించిన పెసా కమిటీ సభ్యుల మండల సమావేశంలో పాల్గొని ఆయన మాట్లాడారు.ఈ సమావేశం అనంతరం మండల కార్యవర్గం ఏర్పాటు చేశారు. మండల కమిటీ గౌరవాధ్యక్షుడుగా సల్లా రామకృష్ణ, గౌరవ సెక్రటరీగా లకే అబ్బాయిదొర, మండల ఫోరం అధ్యక్షుడిగా వంజంగి రమేశ్‌నాయుడు, కార్యదర్శిగా బోనంగి రమణ, ఉపాధ్యక్షుడిగా ఆర్.కృష్ణారావు, బి.శ్రీనివాసరావు, కె.బాలరాజు, పాలవెల్లి, సహాయ కార్యదర్శులుగా యువరాజు, జి.త్రినాథ్, బి.సింహాచలం, కె.వెంకటేష్, పి.లక్కు, కె.సింహాచలం, కోశాధికారిగా కొట్టగుళ్లి సింహాచలం నాయుడును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

తేనె అనుబంధ ఉత్పత్తులతో అదనపు ఆదాయం

చింతపల్లి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీలు తేనె అనుబంధ ఉత్పత్తులతో అదనపు ఆదాయం పొందవచ్చునని స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం టీచింగ్ అసోసియేట్ కె. బాబూజీనాయుడు అన్నారు. బుధవారం స్థానిక వ్యవసాయ పరిశోధన స్థానంలో జరుగుతున్న తేనెటీగల పెంపకం శిక్షణ కార్యక్రమంలో తేనె అనుబంధ ఉత్పత్తులపై టీచింగ్ అసోసియేట్ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీచింగ్ అసిస్టెంట్ ఎస్.శ్వేత, ఆర్ఏ డాక్టర్ టి. సునీల్ కుమార్, గిరిజన యువ రైతులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ జాతరకు సహకరించాలి



సమావేశంలో ఎంపీపీ అనుషదేవి, సర్పంచి పుష్పలత, తదితరులు

చింతపల్లి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీల ఆరాధ్యదైవం ముత్యాలమ్మ జాతర విజయవంతానికి ప్రజలు, అధికారులు సహకరించాలని స్థానిక మేజర్ పంచాయతీ సర్పంచి దురియా పుష్పలత కోరారు. బుధవారం అమ్మవారి ఆలయంలో ఎంపీపీ కోరాబు అనుషదేవి అధ్యక్షతన జాతర నిర్వాహణపై సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆమె మాట్లాడుతూ, ఏప్రిల్ 24వతేదీ నుంచి 27 వరకు అమ్మవారి ఉత్సవం నిర్వహిస్తామన్నారు. ఉత్సవ కమిటీ నియామకంపై శుక్రవారం గ్రామ సభను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈకార్యక్రమంలో వర్తకసంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జోగేశ్వరరావు, పెదిరెడ్ల బేతాళుడు, హెచ్‌డబ్ల్యూవో పసుపులేటి వినాయకరావు, జీసీసీ ఉద్యోగుల సంఘం నాయకుడు దురియా హేమంత్ కుమార్, గ్రామపెద్దలు తాటిపాకల రమేశ్, నాగేశ్వరరావు, సోమేశ్, సత్తిబాబు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



మృతి చెందిన నూకరాజు

పాడేరురూరల్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుత్తులపుట్టు గ్రామ సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెం దాడు. పెదబయలు మండలం కోడాపల్లి పంచాయతీ కుసుమగరువు గ్రామానికి చెందిన తుర్రే కొండబాబు, చెల్లెమ్మ ఏకైక కుమారుడు నూకరాజు(20) వ్యక్తిగత పనిపై బుధవారం సాయంత్రం బైక్‌పై పాడేరు వచ్చారు. తిరిగి రాత్రి 8.30 గంటల సమయంలో వెళ్తుండగా గుత్తులపుట్టు పోతురాజు గుడి మలుపు వద్ద రోడ్డు పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని బలంగా ఢీ కొన్నాడు. దీంతో నూకరాజుకు తలకు బలమైన గాయమై సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎస్ఐ ఎ.సూర్యనారాయణ సిబ్బందితో చేరుకొని మృతదేహాన్ని పాడేరు ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ఘటనపై గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడతామన్నారు.

ఏప్రిల్ 30న అప్పన్న చందనోత్సవం

విశాఖపట్నం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): సింహాచలం వరాహ లక్ష్మీనృసింహస్వామి చందనోత్సవం (నిజరూప దర్శనం) వచ్చే నెల 30వ తేదీన జరుగుతుందని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ తెలిపారు. చందనోత్సవానికి భారీఎత్తున భక్తులు హాజరుకానున్నందున పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో చందనోత్సవ ఏర్పాట్లపై రెవెన్యూ, పోలీస్, దేవదాయ, ఇతర శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. దర్శనం టికెట్ల విక్రయ కేంద్రాలు విశాఖలో అనుకూలమైన ప్రాంతాల్లో ఏర్పాటుచేయాలని ఆదేశించారు. దర్శనం కోసం రూ.1,500, రూ.1,000, రూ.300 టికెట్ల అమ్మకం ప్రణాళికాయుతంగా చేపట్టాలన్నారు. వీఐపీలకు అంతరాలయ దర్శనాలపై అధికారులతో మాట్లాడిన తరువాత నిర్ణయం తీసుకుంటామని ఆయన చెప్పారు.

సాయినగర్‌లో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

చింతపల్లి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక సాయినగర్‌లో తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు ఎంపీడీవో యూఎస్‌వీ శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం కాలనీవాసులు నీటి సమస్యను పరిష్కరించాలని ఆందోళన చేపట్టిన విషయం పాఠకులకు తెలిసిందే. ఈ నేపథ్యంలో బుధవారం ఎంపీపీ కోరాబు అనుషదేవి, సర్పంచి దురియా పుష్పలత, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సాయినగర్‌లో పర్యటించారు. స్థానికులకు ట్యాంకర్లతో నీటి సరఫరా చేశారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ సాయినగర్ ప్రాంతంలో ప్రధాన పైపులైన్‌లో ఉన్న అ క్రమ కొళాయి కనెక్షన్లు తొలగించి పూర్తిస్థాయిలో నీటిని సరఫరా చేస్తామన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ జి. స్వర్ణలత పాల్గొన్నారు.

కాఫీ కార్మికుల క్వార్టర్స్ మరమ్మతులు చేపట్టాలి: సీపీఎం

పాడేరురూరల్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని మినుములూరు కాఫీ కాలనీలో నివాసం ఉంటున్న కార్మికుల క్వార్టర్లను తక్షణమే మరమ్మతులు చేపట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స డిమాండ్ చేశారు. ప్రజా చైతన్య యాత్రలో భాగంగా బుధవారం ఈ కాలనీలో పర్యటించారు. స్థానికులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎల్.సుందరరావు, వి.దాసు, కాఫీ కార్మికులు పాల్గొన్నారు.

21న పెదగ్రహారంలో వాలీబాల్ పోటీలు, వైద్య శిబిరం

గూడెంకొత్తవీధి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదగ్రహారం గ్రామంలో ఈనెల 21న మెగా వాలీబాల్ టోర్నమెంట్, ప్రత్యేక వైద్యశిబిరం ఏర్పాటు చేస్తున్నట్టు స్థానిక సీఐ వర ప్రసాద్ అన్నారు. గిరిజన యువతను క్రీడల్లో ప్రోత్సాహించడంతోపాటు ఆదివాసీలకు మెరుగైన వైద్యం అందించాలనే లక్ష్యంతో వీటిని ఏర్పాటు చేస్తున్నామన్నారు. వాలీబాల్ టోర్నమెంట్‌లో పాల్గొనేందుకు ఆసక్తి కలిగిన క్రీడాకారులు ముందుగా పోలీసు స్టేషన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు.

తాగునీటి సమస్యపై నిరసన

చింతపల్లి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చౌడుపల్లి పంచాయతీ పరిధి వినకొత్తూరు గ్రామస్థుల తాగునీటి సమస్య పరిష్కరించాలని సీపీఎం మండల కార్యదర్శి పాంగి ధనుంజయ్ డిమాండ్ చేశారు. బుధవారం గ్రామ గిరిజనులతో కలిసి చౌడుపల్లి సచివాలయం వద్ద ఆందోళన చేపట్టి, సచివాలయం ఉద్యోగులకు వినతి పత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో గిరిజన సంఘం మండల కార్యదర్శి సాగిన చిరంజీవి పాల్గొన్నారు.

21, 22 తేదీల్లో రక్తదాన శిబిరాలు

పాడేరురూరల్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): రెడ్ క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 21 శుక్రవారం పాడేరు ప్ర భుత్వ డిగ్రీకళాశాలలో, 22వ తేదీ శనివారం చింతపల్లి ప్రభుత్వ డిగ్రీకళాశాలలో రక్తదాన శిబిరాలు నిర్వహించనున్నట్టు కలెక్టర్ ఏఎస్ దినేశ్ కుమార్ తెలిపారు. జిల్లాలో రక్త నిల్వలు తక్కువగా ఉన్నందున రక్త సేకరణ అత్యవసరంగా ఈ శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. ఈ శిబిరాల్లో యువతీ, యువకులు స్వచ్ఛం దంగా పాల్గొనాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. రక్తదానం తో అత్యవసర సమయంలో ఎంతో మంది ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుందన్నారు.

ముంచంగిపుట్టులో సబ్ పోస్టాఫీసు ఏర్పాటుకు పరిశీలన



ఖాళీగా ఉన్న ప్రభుత్వ భవనాన్ని పరిశీలిస్తున్న పోస్టల్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు

ముంచంగిపుట్టు, మార్చి 19(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో త్వరలో సబ్ పోస్టాఫీసు ఏర్పాటు చేయనున్నట్టు అనకాపల్లి డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు అన్నారు. పోస్టాఫీసుకు అనుకూలమైన ఖాళీగా ప్రభుత్వ భవనాలు, స్థలాలను బుధ వారం ఆయన పరిశీలించారు. స్థలమైనా కేటాయించాలని కోరుతూ ఇన్‌చార్జి ఎంపీడీవో సూర్యనారాయణ మూర్తి, తహశీల్దార్ నర్సమ్మలకు వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో అరకు డివిజన్ పోస్టల్ ఐపీవో లక్ష్మీకిశోర్, సిబ్బంది శ్రీను, సర్ని సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

మావోయిస్టులకు వ్యతిరేకంగా ర్యాలీ



గరిమండ వారపు సంతలో గిరిజనుల ర్యాలీ

కొయ్యూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) మావోయిస్టుల వారోత్సవాలు మా కొద్దు అంటూ బుధవారం గరిమండ వారపు సంతలో గిరిజనులు ర్యాలీ నిర్వహించా రు. ఈసందర్భంగా అరాచకాలు వద్దు.. అభివృద్ధే ము ద్దు అంటూ నినాదాలిచ్చారు. ఉద్యమాల పేరుతో అభి వృద్ధిని అడ్డుకోవద్దు అంటూ కో రారు. ఎవరి కోసం కట్టాలి స్థూపాలు, దేనికోసం జరపాలి వారోత్సవాలం టూ పేర్కొన్న బ్యానర్లతో ర్యాలీ నిర్వహించారు. బూదరాళ్ల పంచాయతీ పరిధి అత్యంత మారుమూల గరిమండ వారపు సంతలో గిరిజనులు పాల్గొని ఇలా ర్యాలీ నిర్వహించటం వెనుక పోలీసులు ప్రోద్బలం ఉందనే వాదనలు వినిపిస్తున్నాయి.

హత్య కేసులో నిందితుడికి 14 ఏళ్ల జైలు, జరిమానా

విశాఖ లీగల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): హత్య కేసులో నిందితుడికి 14 ఏళ్ల జైలు శిక్ష, రూ.2 వేల జరిమానా విధిస్తూ నగరంలోని 12వ అదనపు జిల్లా న్యాయమూర్తి పి.గోవర్ధన్ బుధవారం తీర్పు ఇచ్చారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ వి.దేవానందరావు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి.. నిందితుడు మోహన్ పూజారి (59) కర్నాటక రాష్ట్రంలోని ఉడిపి జిల్లా అంబటిపూడి గ్రామస్థుడు. అక్కడి నుంచి ఉమ్మడి విశాఖ జిల్లా ముంచంగిపుట్టు మండలం జర్సు పంచాయతీ సంతవీధికి వచ్చి యాచన చేసుకునేవాడు. అతడికి గంజాయి సేవించే అలవాటు ఉండేది. జర్సు పంచాయతీ సంతవీధి వాసి అయిన వంతల రామారావు 2024 మార్చి 3న తన ఇంటి నుంచి సంత వీధి ప్రాంతానికి పాలపిండి అమ్మడానికి వెళ్లాడు. ఉదయంయాచకుడు రామారావును గంజాయి అడగడంతో ఇద్దరూ ఘర్షణ పడ్డారు. సాయంత్రం మరోసారి ఇద్దరి మధ్య ఘర్షణ జరిగింది. దీంతో నిందితుడు పూజారి బలమైన కత్తితో రామారావును కడుపులో పొడవడంతో రక్తపు మడుగు మధ్య అక్కడికక్కడే మృతిచెందాడు. రామారావు తండ్రి బలరాం ఫిర్యాదుతో అప్పటి సీఐ ఎస్.రమేశ్ కేసు దర్యాప్తు చేసి నిందితుడిపై 302 సెక్షన్ కింద కేసు నమోదు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పు ఇచ్చారు.

'పది' పరీక్ష కేంద్రాలను పరిశీలించిన డీఈవో

ముంచంగిపుట్టు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంతో పాటు జోలాపుట్టులలో జరుగుతున్న పదో తరగతి పరీక్ష కేంద్రాలను బుధవారం డీఈవో బ్రహ్మాజీరావు తనిఖీలు చేపట్టారు. కేంద్రాల వద్ద కల్పించిన సౌకర్యాలను పరిశీలించారు. జోలాపుట్టులో సీసీ కెమెరాల పని తీరుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా డీఈ వో మాట్లాడుతూ మాస్ కాపీయింగ్‌కు ఆస్కారం లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

కాపీయింగ్‌కి తావివ్వొద్దు: తహసీల్దార్

గూడెంకొత్తవీధి: పదో తరగతి పరీక్షల్లో మాస్‌కాపీయింగ్‌కి అవకాశం ఇవ్వరాదని స్థానిక తహసీల్దార్ టి. రామకృష్ణ ఆదేశించారు. బుధవారం స్థానిక బాలికల ఆశ్రమ పాఠశాల ఏ, బీ పరీక్ష కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో చీఫ్ సూపరింటెండెంట్ పల్లవి పాల్గొన్నారు.



జోలాపుట్టు పరీక్ష కేంద్రం తనిఖీ చేసి బయటకు వస్తున్న డీఈవో బ్రహ్మాజీరావు

హత్యకు గురైంది ట్రాన్స్‌జెండర్

... 5వ పేజీ తరువాయి

తల, ఎడమ చేయి కనిపించాయి. వీటిని ప్యాక్ చేసి ఎస్టీఆర్ వైద్యాలయం మార్చురీకి పంపారు. అనంతరం నిందితుడిని వెంటబెట్టుకుని కశింకోట మండలం తాళ్లపాలెం మామిడివాక గెడ్డ వద్దకు వెళ్లారు. అక్కడ మిగిలిన శరీర భాగాలు (మొండెం) వున్న సంచిను అతను చూపించాడు. పంచనామా అనంతరం ఎస్టీఆర్ వైద్యాలయం మార్చురీకి తరలించారు. దీంతో బయ్యవరం వద్ద మంగళవారం లభించిన శరీర భాగాలు మహిళవిగా భావించిన పోలీసులు, బుధవారం మిగిలిన శరీర భాగాలు కూడా లభ్యమైన తరువాత హత్యకు గురైంది ట్రాన్స్‌జెండర్‌గా నిర్ధారించారు.

నాగులాపల్లి అద్దె ఇంటిలోనే హత్య?

ట్రాన్స్ జెండర్ దిలీప్ అలియాస్ దీపును సోమవారం అర్ధరాత్రి నాగులాపల్లిలోని అద్దె ఇంటిలోనే హత్య చేసి, శరీరాన్ని ముక్కలుగా నరికి, బెడ్‌షీట్‌లో, బాక్సులో, సంచిలో వేసుకుని మూడుచోట్ల పడేసినట్టు పోలీసుల విచారణలో బన్నీ చెప్పినట్టు తెలిసింది.

దీపుగా మారిన దిలీప్

హత్యకు గురైన ట్రాన్స్‌జెండర్ అసలు పేరు మైపాలి దిలీప్ శివశంకర్ (40). అనకాపల్లి గవరపాలెంలో ఉన్న ముత్రాసుకాలనీకి చెందిన దిలీప్..ట్రాన్స్‌జెండర్‌గా మారి 'దీపు'గా పేరుమార్చుకున్నాడు. అప్పటి నుంచి తల్లిదండ్రులకు దూరంగా వున్నాడు.

నాలుగేళ్ల నుంచి సహజీవనం

పశ్చిమ గోదావరి జిల్లా ఇరగవరం మండలం పొదలాడకు చెందిన బన్నీ కొన్నేళ్ల క్రితం ఉపాధి నిమిత్తం అనకాపల్లి వచ్చాడు. ఒక ఫుడ్ డెలివరీ కంపెనీలో బాయ్‌గా పనిచేస్తుండగా ట్రాన్స్‌జెండర్ దీపుతో పరిచయం ఏర్పడింది. సుమారు నాలుగేళ్ల నుంచి వీరు సహజీవనం చేస్తున్నట్టు తెలిసింది. ఏడాది క్రితం మునగపాక మండలం నాగులాపల్లిలో ఒక ఇల్లు అద్దెకు తీసుకుని నివాసం వుంటున్నారు. వీరిరువురూ తరచూ గొడవ పడుతూ ఉండేవారని స్థానికులు చెబుతున్నారు. కాగా కేసుకు సంబంధించి పూర్తి వివరాలను గురువారం మీడియాకు వెల్లడిస్తామని పోలీసు అధికారులు చెప్పారు.

భారీ దోపిడీకి స్కెచ్ వేసిన బ్యాంక్ ఉద్యోగి

- పోలీసుల చాకచక్యంతో నిందితుడు పట్టివేత
- రెండు పిస్టల్స్, 17 బుల్లెట్లు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన కాకినాడ జిల్లా ఎస్పీ బిందుమాధవ్

సర్పవరం జంక్షన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): అతడో బ్యాంకు ఉద్యోగి. ఆన్‌లైన్ బెట్టింగ్, ఇతర చెడు వ్యసనాల కారణంగా పని చేసే బ్యాంకులో బంగారు ఆభరణాలు చోరీ చేసి నిందితుడిగా మారాడు. అప్పులు తీర్చేందుకు వేరేదారి లేక కష్టపడకుండా సులువుగా డబ్బులు సంపాదించేందుకు చోరీల బాటను ఎంచుకున్నాడు. చిన్నచిన్న చోరీలు చేస్తే ప్రయోజనం లేదని ఏదైనా బ్యాంకు, ఏటీఎంలో చోరీకి పాల్పడి పెద్ద మొ త్తంలో దోపిడీ చేస్తే జీవితంలో సెటిల్ అయిపోవచ్చనే దురుద్దేశంతో బీహార్ నుంచి 2 పిస్టల్స్ కొనుగోలు చేశాడు. చోరీకి రెక్కీలు నిర్వహిస్తోండగా మంగళవారం రాత్రి కాజులూరులో రెక్కీ నిర్వహిస్తోండగా కాకినాడ జిల్లా పోలీసులు అప్రమత్తంగా వ్యవహరించి చాకచక్యంగా నిందితుడ్ని పట్టుకున్నారు. 2 పిస్టల్స్, 17 బుల్లెట్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడి అరెస్ట్ వివరాలను బుధవారం సర్పవరం జంక్షన్‌లో గల కాకినాడ రూరల్ సర్కిల్ కార్యాలయంలో సీఐ డీఎస్ చైతన్యకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. విశాఖపట్టణం మద్దిలపాలెం ఫిష్‌మార్కెట్ సమీపంలో గ్రూప్‌హౌస్‌లో చిటికెల నాగేశ్వరరావు, భార్య కుటుంబ సభ్యులతో కలసి నివాసం ఉంటున్నాడు. అతడు గతంలో పశ్చిమ గోదావరి జిల్లా నిడమర్రు చైతన్య గోదావరి గ్రామీణ బ్యా ంకులో ప్రొబెషనరీ ఆఫీసర్‌గా పనిచేసేవాడు. ఈక్రమంలో ఆన్‌లైన్ బెట్టింగ్, చెడు వ్యవసనాల కారణంగా బ్యాంకు నుంచి 900 గ్రాముల బం గారాన్ని బ్యాంకు నుంచి తనకున్న అధికారాన్ని దుర్వినియోగం చేసి సొంత అవసరాలకు వాడుకోవడంతో సస్పెండ్ చేశారు. ఈ సందర్భంగా సుమారు రూ.40 లక్షలు బ్యాంకుకి కట్టేశాడు. అప్పులు తీర్చలేక, చెడు వ్యసనాలకు డబ్బుల్లేక చోరీల బాట పట్టాడు. చిన్న చోరీలతో జీవితంలో స్థిరపడటం సాధ్యం కాదని గ్రహించిన నాగేశ్వరరావు భారీ దోపిడీకి స్కెచ్ వేశాడు. బీహార్ ముంగర్ ప్రాంతానికి వెళ్లి 2పిస్టల్స్, 17 బుల్లెట్లు కొనుగోలు చేశాడు. దాంతో బ్యాంకు, ఏటీఎంల దోపిడీ చేసేందుకు విశాఖ సిటీ, రూరల్, నర్సీపట్నం, ఆంధ్ర, తమిళనాడు బోర్డర్‌లలో రెక్కీ నిర్వ హించాడు. ఈ క్రమంలో నేరస్తుడు కాజులూరులో రెక్కీ నిర్వహిస్తున్నాడన్న పక్కా సమాచారంతో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు బుధవారం కాకినాడ జిల్లా పోలీసులు చాకచక్యంగా వ్యవహ రించి నిందితుడ్ని పట్టుకుని, అతడి వద్ద నుంచి 2 పిస్టల్స్ 17 బుల్లెట్లు స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్పీ బిందు మాధవ్ తెలిపారు. నిందితుడు అరెస్ట్‌తో భారీ దోపిడీని పోలీసులు నియంత్రించడం జరిగిందన్నారు. నిందితుడిపై నర్సీపట్నంలో 3 కేసులు, అన్నవరం, నక్కపల్లి, తాడేపల్లిగూడెం, ఏలేశ్వరం పీఎస్‌లో తలో ఓ కేసు వెరసి మొత్తంగా ఒక చైన్ స్నాచింగ్, 4 రాత్రి, పగలు చోరీలు, ఓబైక్ చోరీ కేసులు ఉన్న ట్లు తెలిపారు. నిందితుడ్ని చాకచక్యంగా పట్టుకోవడంలో కీలకంగా పనిచేసిన కాకినాడ రూరల్ సర్కిల్ పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ అభినందించారు. సమావేశంలో ఏఎస్పీ మనీష్ దేవరాజ్ పాటిల్, ఎస్ఐలు ఎంవీవీ రవీంద్రబాబు,ఎం.మోహన్‌కుమార్ పాల్గొన్నారు.

కొత్త అమావాస్య జాతరకు ఏర్పాట్లు

▸ ఉత్సవ నిర్వాహక కమిటీ ప్రతినిధి శ్రీనివాసరావు

నర్సీపట్నం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): కొత్త అమావాస్య మహోత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నామని ఉత్సవ నిర్వాహక కమిటీ ప్రతినిధి కొరుప్రోలు శ్రీనివాసరావు చెప్పారు. నూకాలమ్మ గుడి ఆవరణలో బుధవారం ఉత్సవాల ఏర్పాట్లపై ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 22వ తేదీ రాత్రి మొదటి జాగారం, 24న రెండో జాగారం, 27న పెద్ద జాగారం నిర్వహిస్తామని తెలిపారు. 28న కొత్త అమావాస్య పండగను వైభవంగా నిర్వహించాలని స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఆదేశించారన్నారు. 27, 28 తేదీల్లో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. ఆయన వెంట సభ్యులు కుప్పిలి శ్రీనివాసరావు, దాడి శ్రీను, ఎం.అప్పలరాజు, కె.చిన్న ఉన్నారు.

షుగర్ ఫ్యాక్టరీకి చెరకు తరలింపు

▸ 'ఆంధ్రజ్యోతి' కథనంతో జేసీ జాహ్నవి ఆదేశాలు



ట్రాక్టర్‌లో చెరకు లోడ్ చేస్తున్న రైతులు

దేవరాపల్లి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) మండలంలోని కొత్తపెంట గ్రామంలో రైతు రొంగలి వెంకటరావుకు చెందిన చెరకును బుధవారం గోవాడ షుగర్ ఫ్యాక్టరీకి తరలించారు. చెరకు కూలి, రవాణా ఖర్చులు భరించలేక వెంకటరావు మంగళవారం తోటకు నిప్పు అంటించారు. ఈ ఘటనపై 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన ప్రత్యేక కథనానికి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ స్పందించారు. పరిశీలించాలని జాయింట్ కలెక్టర్ జాహ్నవికి సూచించడంతో, సంఘటనా స్థలాన్ని జేసీ సందర్శించి చెరకును గోవాడ ఫ్యాక్టరీకి తరించే బాధ్యతను ఫ్యాక్టరీ చర్యలు చేపట్టాలని ఎండీ సన్యాసినాయుడును ఆదేశించారు. ఈ మేరకు ఫ్యాక్టరీ ఏవో మోహన్‌రావు, పీల్డ్‌మన్ చిరంజీవి రైతు వెంకటరావు సమక్షంలో బుధవారం చెరకును కూలీలతో నరికించి గోవాడ షుగర్ ఫ్యాక్టరీకి తరలించారు. కె.కోటపాడు ఇన్‌చార్జి తహసీల్దార్ డి.రమేశ్‌బాబు, వీఆర్వో గౌరీ శంకర్, వ్యవసాయ శాఖ సహాయకుడు హరి దగ్గరుండి చెరకు తరలించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరగాలి

ఆర్జేడీ విజయభాస్కరావు



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఆర్జేడీ

రావికమతం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరగాలని ఆర్జేడీ విజయ భాస్కరావు సూచించారు. బుధవారం రావికమతం వచ్చిన ఆయన పదో తరగతి పరీక్షల నిర్వహణపై ఆరా తీశారు. అనంతరం పరీక్షల నిర్వహణ విధానంపై ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. రావికమతం హైస్కూల్‌లో ఒకప్పుడు జిల్లాలోనే అధిక సంఖ్యలో విద్యార్థులు ఉండేవారని, ఆ సంఖ్య ఇప్పుడు బాగా తగ్గడానికి కారణాలు ఏమిటని ప్రశ్నించారు. ఈ పాఠశాలకు పూర్వ వైభవం తీసుకురావడానికి ఉపాధ్యాయుల కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం మల్లికార్జునరావు పాల్గొన్నారు.

'జామియా మసీదు అధ్యక్షుడి నియామకం సరికాదు'

మాడుగుల, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మసీదులోని ముస్లిం సోదరుల అభిప్రాయం తీసుకోకుండా జామియ మసీదు అధ్యక్షుడిగా మస్తాన్‌ను ఏకపక్ష నిర్ణయంతో నియమించడం సరికాదని ప్రస్తుత అధ్యక్షుడు ఎస్‌కే ఖాదర్ వల్లీ, కార్యదర్శి ఎస్‌కె జమిల్ పేర్కొన్నారు. మస్తాన్‌ను అధ్యక్షుడిగా వక్ఫ్ బోర్డు ప్రకటించి నియామకపత్రాన్ని అందించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అతన్ని వెంటనే తొలగించాలని వారు డిమాండ్ చేశారు.

ప్రాసెసింగ్ యూనిట్ కోసం భూముల పరిశీలన

గొలుగొండ, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు బుధవారం రెవెన్యూ అధికారులు భూములను పరిశీలించారు. అమ్మపేట, పాతమల్లంపేట గ్రామాల్లో సుమారు 125 ఎకరాలను సేకరించాలని స్పీకర్ అయ్యన్నపాత్రుడు రెవెన్యూ అధికారులను ఆదేశించినట్టు తెలిసింది. ఈ మేరకు ఆర్ఐ నాగరాజు, మండల సర్వేయర్ సత్యనారాయణ, వీఆర్‌వోలు పడాల్, గోవర్ధన్, తదితరులు అమ్మపేటలో భూములను పరిశీలించారు.

జీడి పిక్కలను రైతు సేవా కేంద్రాల్లో కొనుగోలు చేయాలి

రావికమతం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): జీడి పిక్కలను ప్రభుత్వమే రైతు సేవా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.గోవిందరావు డిమాండ్ చేశారు. ప్రజాచైతన్య యాత్రలో భాగంగా బంగారు బందల నుంచి అజయ్‌పురం గ్రామం వరకు బుధవారం ర్యాలీ నిర్వహించారు. ధాన్యం మాదిరిగా జీడి కొనుగోలు చేయాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు కొర్రా బాలరాజు, సీదిరి భీమరాజు తదితరులు పాల్గొన్నారు.

అధికారుల తీరుపై ప్రజా ప్రతినిధుల ధ్వజం

▸ కనీస గౌరవం ఇవ్వడం లేదని మండిపాటు
▸ సమస్యలను పట్టించుకోవడం లేదని అసహనం
▸ వాడీవేడిగా మండల సర్వసభ్య సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ గజ్జలపు మణికుమారి... సర్పంచ్, ఎంపీటీసీ సభ్యుల వాగ్వాదం

గొలుగొండ, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): అధికారుల తీరుపై సభ్యులు ధ్వజమెత్తారు. ప్రజా ప్రతినిధులకు కనీస గౌరవం ఇవ్వడం లేదని మండిపడ్డారు. సమస్యలు తెలిపినా పట్టించుకోవడం తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. దీంతో సర్వసభ్య సమావేశం వాడీవేడిగా సాగింది. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ గజ్జలపు మణికుమారి అధ్యక్షతన బుధవారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. శాఖల వారీగా చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను వివరించారు. ఈ క్రమంలో తమకు కనీస గౌరవం ఇవ్వలేని పరిస్థితులు మండలంలో చోటు చేసుకున్నాయని జడ్పీటీసీ సభ్యుడు సుర్ల వెంకట గిరిబాబు, పలువురు సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు ధ్వజమెత్తారు. ఏఎల్ పురం మేజర్ పంచాయతీలోని ఎంపీటీసీ సెగ్మెంట్-2లో డ్రైనేజీల్లో పేరుకుపోయిన పూడిక ఏడాది నుంచి తొలగించాలని అధికారులకు విన్నవించినా పట్టీపట్టనట్టు వ్యహరిస్తున్నారని ఎంపీటీసీ సభ్యుడు రామకృష్ణ మండిపడ్డారు. సెగ్మెంట్‌లో సర్పంచ్ లోచుల సుజాత కక్షపూరితంగా పూడిక తొలగించలేదని ఆరోపించారు. దీంతో సర్పంచ్ కలుగజేసుకుని గత ఏడాదిలో పూడిక తొలగించే పనులు చేపట్టామని తెలిపారు. ఈ క్రమంలో వారిద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. అలాగే ఉపాధి హామీ పథకం కింద చెరువుల్లో పూడికతీత పనులు చేపట్టేవారని, అదే చెరువుల్లో మరలా పూడిక తీయడంతో చెరువులు లోతు పెరిగిపోయి మదాలకు నీరందక రైతులు నానా పాట్లు పడుతున్నారని నాగాపురం సర్పంచ్ రఘురాం తెలిపారు. గ్రామ పంచాయతీల తీర్మానం లేకుండా, తమకు తెలియకుండానే వివిధ పనులను జరిగిపోతున్నాయని ఆయన చెప్పారు. ప్రస్తుతం వేసవి కావడంతో బోర్ల మెటీరియల్ మండల పరిషత్ కార్యాలయంలో సిద్ధంగా ఉంచాలని గొలుగొండ సర్పంచ్ అప్పారావు అధికారులను కోరారు. గొలుగొండలోని గొల్లవీధికి నెల రోజులుగా తాగునీటి సమస్య ఉందని అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఎంపీపీ మణికుమారితో పాటు జడ్పీటీసీ సభ్యుడు మాట్లాడుతూ మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని పలుమార్లు స్పీకర్ అయ్యన్నపాత్రుడు తెలియజేస్తున్నప్పటికీ, దానికి విరుద్ధంగా అధికారులు వ్యవహరించడం సరికాదన్నారు. అధికారుల తీరు మార్చుకోకుంటే ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. ఇదిలా ఉండగా చోద్యం, కొత్తఎల్లవరం, ఏటిగైరంపేట, పాతమల్లంపేట, కొంగశింగి పంచాయతీల సర్పంచులు రెండేళ్లుగా సమావేశానికి గైర్హాజరుకావడం చర్చనీయాంశంగా మారింది. ఈ సమావేశంలో ఎంపీడీవో మేరీరోజీ, వైస్ ఎంపీపీలు ఆదినారాయణ, జక్కు నాగమణి, పలు శాఖల అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు పాల్గొన్నారు.

రూ.2.05 కోట్ల ఉపాధి నిధుల విడుదల

కె.కోటపాడు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో 44 పనుల కోసం ఉపాధి హామీ పథకం కింద రూ.2.05 కోట్లు విడుదలయ్యాయని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నిధులతో అన్ని గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపడతామన్నారు. కె.కోటపాడు మండలం గవరపాలెం గ్రామంలో ఐదు పనులకు రూ.25.7 లక్షలు, పాతవలసలో రెండు పనులకు రూ.40 లక్షలు, దాలివలసలో ఒక పనికి రూ.20.20 లక్షలు మంజూరయ్యాయని ఎమ్మెల్యే తెలిపారు.

'జనసేనలో కష్టపడే వారికి సముచిత స్థానం'

నాతవరం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): పార్టీలో కష్టపడే కార్యకర్తలకు సముచిత స్థానం ఉంటుందని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి రాజాన వీరసూర్యచంద్ర పేర్కొన్నారు. బుధవారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కలిసికట్టుగా పనిచేయాలని కోరారు. స్థానిక టీడీపీ నాయకులతో కూటమి ధర్మాన్ని పాటిస్తూ విబేధాలు లేకుండా ముందుకు సాగాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో జనసేన పార్టీ మండల అధ్యక్షుడు వెలగల వెంకటరమణ మండల యూత్ అధ్యక్షులు బైన మురళి పాల్గొన్నారు.

తాగునీటి పైపులైన్‌కు మరమ్మతులు

మాకవరపాలెం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో తాగునీటి పైపులైన్‌కు బుధవారం మరమ్మతులు చేపట్టారు. లచ్చన్నపాలెం సర్పానదిలోని భారీ తాగునీటి ప్రాజెక్టు నుంచి మాకవరపాలెం నీటి పథకాలకు తాగునీరు వస్తుంది. రెండు రోజుల క్రితం ఈ పైపులైన్లు పగలడంతో అధికారులు వెంటనే మరమ్మతులు చేపట్టారు. దీంతో కొళాయిల నుంచి యథావిధిగా తాగునీరు సరఫరా జరుగుతున్నది.

టీడీపీ సభ్యత్వ కార్డుల పంపిణీ

చోడవరం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వ కార్డుల పంపిణీ కార్యక్రమం బుధవారం ప్రారంభమైంది. పార్టీ మండల అధ్యక్షుడు, గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేడ నాగగంగాధర్ పార్టీ కార్యాలయం నుంచి వచ్చిన ఈ కార్డులను కార్యకర్తలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు కనిశెట్టి మత్స్యరాజు, పట్టణ అధ్యక్షుడు డీవీ.అప్పారావు, పార్టీ నేత సకురు కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నూకాలమ్మ గరగల ఊరేగింపు

కృష్ణాదేవిపేట, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): లింగంపేట నూకాలమ్మ గరగలు ఊరేగింపు బుధవారం ఘనంగా జరిగింది. కొండగోకిరి, చోద్యం, లింగంపేట, కృష్ణాదేవిపేట తదితర గ్రామాల్లో భక్తులు గరగలను దర్శించుకున్నారు. తొమ్మిది రోజుల పాటు జరిగే అమ్మవారి తీర్థ మహోత్సవాలు భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని ఆలయ కమిటీ చైర్మన్ కొడమంచిలి వరలక్ష్మి కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఎ.అప్పలనాయుడు, మాజీ సర్పంచులు అప్పలనాయుడు, జి.సత్యనారాయణ, జనసేన, టీడీపీ నాయకులు లంక సత్యనారాయణ, సలాదుల ప్రసాద్, రమణ, శ్రీకాంత్, దేముడు పాల్గొన్నారు.

నీటి కుంటల నిర్మాణానికి ప్రాధాన్యం

చీడికాడ, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): పండ్ల తోటల పెంపకం ప్రదేశాల్లో నీటి కుంటల నిర్మాణానికి ప్రాధాన్యం ఇవ్వాలని ఎంపీడీవో హేమసుందర్రావు ఆదేశించారు. బుధవారం ఉపాధి పీల్డ్ అసిస్టెంట్లతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెలాఖరులోగా వంద రోజుల పని దినాలు పూర్తి చేయించాలని ఆదేశించారు. ఉదయం 10 నుంచి 11 గంటల వరకు పనులు చేయించి రూ.300 కూలి వచ్చేలా చూడాలన్నారు. ఏపీవో అల్లు గంగునాయుడు, ఈసీ రమేశ్, టెక్నికల్ అసిస్టెంటు పాత్రుడు, ఎర్రునాయుడు, మోహన్ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

చీడికాడ, మార్చి 19(ఆంధ్రజ్యోతి): అప్పలరాజుపురం మోద కొండమ్మ ఆలయం నుంచి రైతుల కళ్లాలకు వెళ్లే సీసీ రోడ్డు నిర్మాణానికి బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా కార్యదర్శి గవిరెడ్డి జగన్నాధం, నాయకులు గవిరెడ్డి శ్రీనివాసరావు, కె.సురేశ్, కె.అప్పలనాయుడు పాల్గొన్నారు.

బుల్లెట్ చోరీ కేసులో నిందితుడి అరెస్టు

నర్సీపట్నం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): బుల్లెట్ చోరీ కేసులో నిందితుడ్ని అరెస్టు చేసి వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్టు పట్టణ సీఐ గోవిందరావు బుధవారం తెలిపారు. బలిఘట్టం గ్రామానికి చెందిన యామాల నానిబాబు బుల్లెట్ పోయిందని ఈ నెల 15న చేసిన ఫిర్యాదు మేరకు విచారించగా, కృష్ణాదేవిపేటకు చెందిన మేకల హరికిరణ్‌ను నిందితుడిగా గుర్తించినట్టు చెప్పారు. అతన్ని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించారన్నారు.

బైక్ బోల్తాపడి వ్యక్తికి తీవ్ర గాయాలు

రావికమతం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): దొండపూడి చెక్ పోస్టు వద్ద మంగళవారం రాత్రి ద్విచక్ర వాహనం అదుపు తప్పి కల్వర్టులో బోల్తా పడింది. ఈ ఘటనలో రోలుగుంట మండలం వి.శరభవరం గ్రామానికి చెందిన జల్లూరి ఈశ్వరరావు తీవ్రంగా గాయపడ్డాడు. ఎర్రబందలోనిబంధువుల శుభకార్యానికి ఈశ్వరరావు బైక్‌పై వస్తూ అదుపుతప్పి కల్వర్టు గొయ్యిలో పడిపోయాడు. బుధవారం అటుగా వెళ్లిన వారు అతన్ని గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రుడ్ని ఏరియా ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం వైద్యులు కేజీహెచ్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

దాడి చేశారని సామాజిక కార్యకర్త ఫిర్యాదు

నర్సీపట్నం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): కొంత మంది వ్యక్తులు తనపై దాడి చేసి అంతు చూస్తామని బెదిరించారని సామాజిక కార్యకర్త కె.శివనారాయణరాజు పట్టణ పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశారు. పదో తరగతి పరీక్షలు రాస్తున్న తన కుమారుడ్ని ఇంటికి తీసుకు వచ్చే సమయానికి తన ఇంటి వద్ద ఐదుగురు వ్యక్తులు ఉన్నారని, వారు మేడమెట్ల మీదకు తీసుకు వెళ్లి తనపై దాడి చేశారని చెప్పారు. తాను కేకలు వేయడంతో వారు కారులో వెళ్లిపోయారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఖాళీ పోస్టుల భర్తీకి చర్యలు: డీఎంహెచ్‌వో



వైద్యాధికారి, సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో రవికుమార్

చీడికాడ, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): చీడికాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఖాళీ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌వో డాక్టర్ రవికుమార్ తెలిపారు. బుధవారం చీడికాడ పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి మందులు, సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. రెండు స్టాఫ్‌నర్సు, ఒక ఎంఎల్‌హెచ్‌పీ పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఈ సందర్భంగా వైద్యాధికారి సునీల్‌కుమార్ డీఎహెచ్‌వో దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై ఆయన స్పందించి వెంటనే ఒక స్టాఫ్‌నర్సును డిప్యుటేషన్‌పై నియమిస్తామని తెలిపారు. వేసవి మూడు నెలలు అప్రమత్తంగా ఉండాలని, ఎటువంటి వ్యాధులు సోకకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అవసరం మేరకు రక్త పరీక్షలు చేయాలని సూచించారు. ప్రాణాంతక వ్యాధులు సోకకుండా సిబ్బందిని అప్రమత్తం చేయాలని ఆదేశించారు. అలాగే ఆస్పత్రి సబ్ సెంటర్‌లో ఉన్న గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు. అవసరమైతే సంబంధిత పంచాయతీ కార్యాలయాల సిబ్బందికి పరిసరాల పరిశుభ్రతపై సలహాలు, సూచనలు ఇవ్వాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్ఎన్ రాజేశ్వరి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పీఎస్ పేటలో వాహనాల రాకపోకలు బంద్

నేటి నుంచి రహదారి నిర్మాణ పనుల కారణంగా నిషేధం

చోడవరం, బుచ్చెయ్యపేట పంచాయతీల వాసులకు అంకుపాలెం మీదుగా ప్రత్యామ్నాయ మార్గం



రహదారి పనులకు మార్కింగ్ ఇస్తున్న ఇంజినీరింగ్ అధికారి శాంతారాం

చోడవరం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కొత్తూరు జంక్షన్ నుంచి బుచ్చెయ్యపేట, రావికమతంతో పాటు మండలంలోని ఐదు పంచాయతీలకు ప్రధానమైన పీఎస్‌పేట రహదారిపై గురువారం నుంచి వాహనాల రాకపోకలు నిలిపివేస్తున్నట్టు మండల ఇంజినీరింగ్ అధికారి పి.శాంతారాం తెలిపారు. గురువారం నుంచి స్థానిక కొత్తూరు జంక్షన్ నుంచి పీఎస్‌పేట రహదారి అభివృద్ధిలో భాగంగా సీసీ రోడ్డు నిర్మాణం చేపడుతున్నందున, ఈ రూటులో వాహనాలు అనుమతించడం లేదని ఆయన స్పష్టం చేశారు. రహదారి పనులు పూర్తయ్యేంత వరకూ అంకుపాలెం మీదుగా వాహనాల రాకపోకలు మళ్లిస్తున్నట్టు ఆయన తెలిపారు. సీసీ రోడ్డు నిర్మాణ పనులు పూర్తయి వినియోగంలోనికి అనుమతించేంత వరకూ ఈ రూటులో వాహనాల రాకపోకలు ఉండబోవని స్పష్టం చేశారు. ఈ విషయాన్ని వాహన చోదకులు, స్థానిక ప్రజలు గుర్తించి తమకు సహకారం అందించాలని ఆయన కోరారు.

వెంకన్నకు 13.5 గ్రాముల బంగారం కానుక

బుచ్చెయ్యపేట, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): వడ్డాది వెంకటేశ్వర స్వామి ఉత్సవాల సందర్భంగా భక్తులు సమర్పించిన వెండి, బంగారు ఆభరణాలను బుధవారం లెక్కించారు. ఈవో డీఎస్ఎస్.శర్మ, శర్మకర్త దొండా కన్నబాబు, గ్రామ పెద్దల సమక్షంలో హుండీలో ముడుపులను తెరిచారు. 13.5 గ్రాముల బంగారం, 17.5 గ్రాముల వెండి కానుకలుగా వచ్చినట్టు ఈవో తెలిపారు. పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు దొండా సన్యాసిరావు, ఎస్.చినవెంకయ్యదొర, దొండా నానాజీ, వీర్ల సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

లేటరైట్‌పై ప్రభుత్వ వైఖరి వెల్లడించాలి

నర్సీపట్నం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): నాతవరం మండలం సుందరకోట పంచాయతీ బమిడికలొద్దిలో లేటరైట్ తవ్వకాలకు సిద్ధపడుతున్నట్టు వస్తున్న వార్తా కథనాలపై ప్రభుత్వ వైఖరి వెల్లడించాలని సీపీఎం నాయకుడు అడిగర్ల రాజు డిమాండ్ చేశారు. బుధవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు లేటరైట్ తవ్వకాలు, అక్రమాలపై ప్రశ్నించిన కూటమి నాయకులు, ఇప్పుడు తవ్వకాలకు అనుమతులు ఇచ్చినట్టు వస్తున్న కథనాలపై స్పందించాలని కోరారు. గిరిజనుల మనుగడకు, అటవీ ప్రాంతానికి, పర్యావరణానికి ప్రమాదం తలపెట్టే మైనింగ్ తవ్వకాలను వ్యతిరేకించాలని, ప్రజల పక్షాన నిలబడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకుడు ఈరెల్లి చిరంజీవి పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించరూ...

మాడుగుల రూరల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): జాలంపల్లి పంచాయతీ శివారు గిరిజన గ్రామమైన సిరిపురంలో తాగునీటి సమస్య పరిష్కరించాలని సీపీఎం మండల కార్యదర్శి నరసింహమూర్తి డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం కార్యకర్తలతో ధర్నా చేశారు. తాగునీరు అందించేందుకు బోరు తవ్వించారని, వాటర్ ట్యాంకు నిర్మించి పైపులైను ద్వారా ఇంటింటి కుళాయిలు ఏర్పాటు చేస్తామని అధికారులు చెప్పారని, ఇప్పటికీ కుళాయిలు ఏర్పాటు చేయకపోవడంతో తాగునీటి ఇబ్బందులు తప్పడం లేదని ఈ సందర్భంగా నరసింహమూర్తి వాపోయారు. కార్యక్రమంలో నాయకులు సన్యాసిరావు, సత్తిబాబు, రాద, కాంతమ్మ పాల్గొన్నారు.

కేజీబీవీలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

రోలుగుంట, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక కేజీబీవీలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని ప్రత్యేకాధికారి తులసీ తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరంలో ఆరో తరగతి, ఇంటర్‌లో ప్రవేశానికి ఈ నెల 22 నుంచి ఏప్రిల్ 11వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు.

ఉపాధి పనులపై సోషల్ ఆడిట్

బుచ్చెయ్యపేట, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఉపాధి పథకం పనులపై పారదర్శకంగా సామాజిక తనిఖీలు జరగాలని ఎంపీడీవో విజయలక్ష్మి సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఈ తనిఖీలను అవకతవకలకు తావులేకుండా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఏపీవో వరహాలుబాబు, ఎస్ఆర్‌పీ రవీంద్ర పాల్గొన్నారు.

నేడు మరిడిమాంబ తీర్థం

మాడుగుల, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మాడుగుల శివారు ఖండివరం వెళ్లే దారిలో మరిడిమాంబ తీర్థ మహోత్సవం గురువారం వైభవంగా నిర్వహించేందుకు కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. ఉదయం ఆరు గంటల నుంచే అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి భక్తులకు కల్పిస్తారు. ఈ సందర్భంగా ఉత్తరాంధ్ర ఎడ్ల పరుగు పందేలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు.

ఎస్సీ వర్గీకరణపై తొందరపాటు వద్దని ధర్నా

చోడవరం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణపై తొందరపాటు నిర్ణయాలు వద్దని మాల మహానాడు కార్యకర్తలు బుధవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు వి.సహదేవుడు, ప్రధాన కార్యదర్శి ఆర్.తాతారావు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ జరిగితే మెజారిటీ సంఖ్యలో ఉన్న మాలలు నష్టపోతారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో విశాఖ మాల మహానాడు కన్వీనర్ జంగా రాంజీ, మచ్చా గిరి, గౌరవ అధ్యక్షులు కచ్చా వెంకటరమణ, గాలి బుల్లిబాబు, గాలి కోటి పాల్గొన్నారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	87.00
లైవ్ ధర	107.00
విత్ స్కిన్	184.00
స్కిన్ లెస్	194.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	415
విజయనగరం	419
శ్రీకాకుళం	419